విలేకరులు కావలెను

పెన్ సత్తా తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాప్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759

RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...

PEN SATTA Telugu Daily



సంపుటి : 3 సంచిక : 275 ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ బుధవారం 25 ఫిబ్రవరి 2026 పేజీలు : 08 వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool



## బాలికలకు ఉచితంగా హెచ్‌పీవీ టీకా

**త్వరలో ప్రారంభించనున్న కేంద్రం**

ఢిల్లీ: మహిళల్లో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌తోపాటు, నివారించదగిన మరికొన్ని రకాల క్యాన్సర్లను అరికట్టేందుకు కేంద్రం నడుం బిగించింది. త్వరలో దేశవ్యాప్తంగా హ్యూమన్ పాపిలోమా వైరస్(హెచ్‌పీవీ)

- మిగతా2లో



## నేటి నుంచి మోదీ ఇజ్రాయెల్ పర్యటన

ఢిల్లీ: ద్వైపాక్షిక రక్షణ, వాణిజ్య సహకారాన్ని పెంపొందించేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ బుధవారం నుంచి రెండు రోజుల పాటు ఇజ్రాయెల్‌లో పర్యటించ నున్నారు. అమెరికా, ఇరాన్‌ల మధ్య సంబంధాలు పూర్తిగా క్షీణించడంతోపాటు పశ్చిమాసియాలో ఇతరత్రా ఉద్రిక్తతలు తీవ్రమవుతున్న దశలో ప్రధాని పర్యటన సాగనుంది. ఇజ్రాయెల్

- మిగతా2లో



## తిరుమల లడ్డూలో కల్తీతో పాటు కుట్ర!

### ల్యాబ్ రిపోర్టును తొక్కి పెట్టిన నాటి టీటీడీ చైర్మన్

- 2019-2024 మధ్య ఇరవై కోట్ల ఒక వెయ్యి లడ్డూల కల్తీ
- 2020లో టెండర్ నిబంధనను మార్చిన వైసీపీ సర్కారు
- ఆ తర్వాత బోలేబాబా సంస్థకు ఆర్డర్లు
- 59 లక్షల కిలోల కల్తీ నెయ్యి సరఫరా
- ఎన్డీడీబీ రిపోర్టులో జంతువుల కొవ్వున్నట్టు నిర్ధారణ
- అందుకే నేను బయట పెట్టాల్సి వచ్చింది”
- ఏపీ అసెంబ్లీలో చంద్రబాబు నాయుడు

- మిగతా2లో

## తిరుపతి లడ్డూలో కెమికల్స్ తో చేసిన నెయ్యి వాడారు..



వైసీపీ హయాంలో లడ్డూ ప్రసాదం కల్తీ జరిగిందన్నారు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్. కల్తీ నెయ్యి వ్యవహారంపై ఏపీ అసెంబ్లీలో ఇవాళ(ఫిబ్రవరి 24) చర్చ సందర్భంగా మాట్లాడిన పవన్ కళ్యాణ్ ..నెయ్యి లేకుండానే నెయ్యి తయారీ జరిగినట్టు రిపోర్టులు ఉన్నాయన్నారు. గత పాలకులు కెమికల్స్ నుంచి నెయ్యి తయారు చేయవచ్చని నిరూపించారని ఆరోపించారు. తిరుమలలో తప్పు జరిగిందనే పశ్చాత్తాపంతో తాను దీక్ష చేశానని చెప్పారు. గత ప్రభుత్వ అధినేత తప్పు చేశాడని తాను ఎక్కడా చెప్పలేదన్నారు పవన్. నాటి టీటీడీ పాలక మండలి బాధ్యత నిర్వహణలో విఫలమైందని...టీటీడీ బోర్డుదే తప్పని తాను చెప్పానన్నారు పవన్.

గతంలో లడ్డూల్లో నాణ్యత లేదనే ఆరోపణలొచ్చాయన్నారు. వైసీపీ నేతలు అడ్డగోలుగా మాట్లాడుతున్నారని ఫైర్ అయ్యారు పవన్.

## దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం...

### ఏపీ క్యాబినెట్ సమావేశంలో కీలక నిర్ణయం

- ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా సైన్స్, టెక్నాలజీ, ఇన్నోవేషన్ శాఖ ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం
- ధృవీకరణ పత్రాలున్న దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి గ్రీన్ సిగ్నల్
- విశాఖలో రూ. 2,387 కోట్లతో సెమీకండక్టర్ పరిశ్రమ ఏర్పాటుకు మంత్రిమండలి ఆమోదం
- రాష్ట్రవ్యాప్తంగా పలు పర్యాటక, పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులకు పచ్చజెండా
- కల్తీ పాలు, డయేరియా ఘటనలపై సీఎం సీరియస్.. కఠిన చర్యలకు ఆదేశం



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సైన్స్, టెక్నాలజీ, ఆవిష్కరణల రంగాలను ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో మంగళవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ‘సైన్స్, టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్’ పేరిట కొత్త శాఖను ఏర్పాటు చేసే ప్రతిపాదనకు ఆమోదముద్ర వేశారు. రాష్ట్రంలో శాస్త్ర, సాంకేతిక రంగాల్లో పాలనా సౌలభ్యం పెంచి, అభివృద్ధిని వేగవంతం చేయడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశంలో మొత్తం 55 అజెండా అంశాలపై

- మిగతా2లో



## పీఏసీఎస్ ఉద్యోగుల జీతాలు 20% పెంపు

- గ్రాట్యుటీ రూ.2లక్షల నుంచి రూ.4లక్షలకు
- సంఘం నేతలతో మంత్రి అచ్చెన్నాయుడు, అధికారుల చర్చలు
- సమ్మె విరమిస్తున్నట్లు ప్రకటన


ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (పీఏసీఎస్) ఉద్యోగులకు 20% మేర జీతాల పెంపునకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. గ్రాట్యుటీ రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షలకు పెంచనుంది. ప్రతి ఉద్యోగికి రూ.5లక్షల కవరేజీతో కూడిన సమగ్ర గ్రూప్ మెడికల్ ఇన్సూరెన్స్ పథకం అమలు చేయాలని నిర్ణయించింది. దీంతో సమ్మె విరమిస్తున్నట్లు పీఏసీఎస్ సంఘాల

- మిగతా2లో

## సేవా తీర్థ్‌లో తొలి కేబినెట్ భేటీ...

### కీలక నిర్ణయాలు తీసుకున్న కేంద్రం

- ‘సేవా తీర్థ్’ నూతన ప్రాంగణంలో ప్రధాని మోదీ అధ్యక్షతన తొలి కేబినెట్ సమావేశం
- దేశవ్యాప్తంగా 14 ఏళ్ల బాలికలకు ఉచితంగా హెచ్‌పీవీ టీకాకు ఆమోదం
- కేరళ రాష్ట్రం పేరును అధికారికంగా ‘కేరళం’గా మార్చేందుకు గ్రీన్ సిగ్నల్
- భారత్‌ను ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు ‘సేవా సంకల్ప్’
- రూ.12,236 కోట్లతో రైల్వే, మెట్రో సహా పలు మౌలిక ప్రాజెక్టులకు ఆమోదముద్ర



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గం మంగళవారం పలు చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంది. నూతనంగా ప్రారంభమైన ‘సేవా తీర్థ్’ సముదాయంలో జరిగిన ఈ తొలి సమావేశంలో, దేశవ్యాప్తంగా బాలికలకు ఉచితంగా హెచ్‌పీవీ టీకా అందించడం, కేరళ పేరును ‘కేరళం’గా మార్చడం సహా అనేక కీలక ప్రతిపాదనలకు ఆమోదముద్ర వేసింది. దీంతో పాటు, రాబోయే రోజుల్లో భారత్‌ను ప్రపంచంలోని మూడు అగ్రశ్రేణి ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా నిలబెట్టడమే లక్ష్యంగా ‘సేవా సంకల్ప్’ పేరిట ఒక తీర్మానాన్ని కూడా ఆమోదించింది.నేడు ‘సేవా తీర్థ్’ ప్రాంగణంలో జరిగిన ఈ సమావేశం దేశ ప్రగతి ప్రయాణంలో ఒక కొత్త అధ్యాయానికి నాంది అని కేబినెట్ అభివర్ణించింది. వలసవాద గతం నుంచి ఆత్మవిశ్వాసంతో కూడిన నవ భారతం వైపు సాగుతున్న ప్రయాణానికి ఈ నూతన పరిపాలనా కేంద్రం ఒక శక్తివంతమైన చిహ్నమని తీర్మానంలో పేర్కొన్నారు. ‘సేవా తీర్థ్’ అనే పేరు సేవ, బాధ్యత, అంకితభావాలకు ప్రతిరూపమని, ఇక్కడ పరిపాలనను

- మిగతా2లో



## మంత్రి లోకేశ్ పనితీరు పట్ల ఏపీ హైకోర్టు ప్రశంసలు!

- కేజీబీవీ సమస్యలపై వేగంగా స్పందించడంపై ధర్మాసనం అభినందన
- అదే సమయంలో అధికారుల నిర్లక్ష్యంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన ధర్మాసనం
- మంత్రికి, ప్రభుత్వానికి అధికారులు చెడ్డపేరు తెస్తున్నారని వ్యాఖ్య

ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పనితీరుపై హైకోర్టు ప్రశంసలు కురిపించింది. కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల (కేజీబీవీ) సమస్యలపై మంత్రి వేగంగా స్పందిస్తున్నారని అభినందించింది. అయితే, అదే సమయంలో విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్య వైఖరిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. మంత్రి చురుగ్గా పనిచేస్తున్నా, అధికారులు ఆయనకు, ప్రభుత్వానికి చెడ్డపేరు

- మిగతా2లో

## అమెరికాతో ఒప్పందం రద్దుకు దమ్ములేని మోదీ



భోపాల్: అమెరికా ఒత్తిడితోనే భారత్ వాణిజ్య ఒప్పందం కుదుర్చుకుందని, ప్రధాని నరేంద్ర మోదీకి దమ్ముంటే ఆ ఒప్పందాన్ని రద్దు చేయాలని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సవాల్ చేశారు. మోదీ పిరికివాడని, ఒప్పందంపై సంతకం చేయడంద్వారా అమెరికాకు లొంగిపోయారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. మంగళవారం భోపాల్‌లో జరిగిన కిసాన్ ర్యాలీలో వారు మాట్లాడారు. అమెరికాతో


- మిగతా2లో

## నేనేంటో చూపిస్తా...!

### తమిళనాడులో సంచలనం.. శశికళ కొత్తపార్టీ

చెన్నై: తమిళనాడులో మరో కొత్త రాజకీయ పార్టీ పురుడు పోసుకుంది. దివంగత నేత, మాజీ సీఎం జయలలితకు అత్యంత సన్నిహితురాలైన శశికళ కొత్త రాజకీయ పార్టీతో తమిళనాడు రాజకీయాల్లో రీఎంట్రీ ఇస్తున్నట్లు ప్రకటించారు. అంతేకాదు.. తన రాజకీయ పార్టీ జెండాను కూడా

- మిగతా2లో



## మీ ఇష్టం... చంపుకోండి

### అడవిపందులను విపత్తుగా ప్రకటించిన నేపాల్

- పంటలు నాశనం చేస్తున్న అడవి పందులపై నేపాల్ సర్కార్ కీలక నిర్ణయం
- పొలాల్లోకి వస్తే వాటిని తరిమివేయొచ్చు, బంధించొచ్చు లేదా చంపేయొచ్చు
- రైతులు తీవ్ర పంట నష్టాన్ని ఎదుర్కొంటుండటంతో ఈ ఉత్తర్వులు
- జాతీయ పార్కులు, అభయారణ్యాల పరిధిలో ఈ నిబంధనలు వర్తించవు
- ఇటీవలే కోతుల విషయంలోనూ ప్రభుత్వం ఇలాంటి ఉత్తర్వులే జారీ

- మిగతా2లో



# తిరుమల లడ్డూలో కల్తీతో పాటు కుట్ర !

అమరావతి: తిరుమల లడ్డూ లో కల్తీతో పాటు కుట్ర జరిగిందని ఏపీ సీఎం చంద్ర బాబు నాయుడు ఆరోపించారు. ఇవాళ ఆయన అసెంబ్లీలో మాట్లాడుతూ.. ఆ నాటి టీటీడీ ఛైర్మన్ కల్తీపై వచ్చిన ల్యాబ్ రిపోర్టునూ తొక్కి పెట్టారని అన్నారు. వైసీపీ పాలనలో నెయ్యి సరఫరాకు సం బంధించిన నిబంధనలు మార్చారని అన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన సిట్ దీనిపై దర్యాప్తు చేసి నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చిందన్నారు. అందులో బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని తెలిపిందని వి వరించారు. 2020లో టెండర్ నిబం ధనను మార్చి నాణ్యత ప్రమాణాలను తగ్గించే పరిస్థితికి వచ్చారన్నారు. 2022 మే నెలలో బోలేబాబా సంస్థకు ఆర్డర్ ఇచ్చారన్నారని వివరించారు. 2022 ఆగస్టులో కల్తీ జరిగిందని వచ్చిన రి పోర్టును తొక్కి పెట్టే పరిస్థితికి నాటి టీటీడీ బోర్డు ఛైర్మన్ వచ్చారని చంద్ర బాబు తెలిపారు. తిరుమల వెంకటేశ్వర స్వామితో పెట్టుకుంటే ఎవరూ బాగు పడరని అన్నారు. తాను 50 ఏండ్లుగా రాజకీయాల్లో ఉన్నానని చెప్పారు. వెం కటేశ్వరస్వామి తమ ఇంటి దైవమన్న చంద్రబాబు ఏ కష్టం ఉన్నా.. ఆయననే వేడుకుంటామని చెప్పుకొచ్చారు. ప్రతి రోజూ వెంకటేశ్వరుడి ఫొటో ముందు ప్రార్ధన చేస్తాను.. చేస్తున్నాను.. అదే తన శక్తి అని వివరించారు. తన మీద 23 క్లైమోర్మైన్స పేల్చినా నన్ను కాపాడింది ఆ దేవుడేనని అన్నారు. తాను సీఎంగా ఉన్న క్యూలో వెళ్లి దర్శనం చేసుకుం టాను తప్ప ఇంకా ఏమీ కాదన్నారు. 59 లక్షల 71 వేల కిలోల కల్తీ నెయ్యిని పవిత్రమైన శ్రీవారి లడ్డూ తయారీకి వినియోగించారని, ఈ నేరం వ్యవస్థీ కృతమని ఆరోపించారు. శ్రీవారి లడ్డూ ప్రసాదం అపవిత్రం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో 234.51 కోట్ల నిధుల్లో అక్రమాలు జరిగాయని ఆరోపించారు. అధికారులు మంత్రులు, ప్రభుత్వం అంతా సిండికేట్ అయ్యారని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత నాసికరం రిపోర్టు ఉందని గ్రహించి ఈవో ఎన్డీడీబీకి పంపారని చంద్రబాబు చెప్పారు. ఎన్డీడీ బీరిపోర్టులో జంతువుల కొవ్వు ఉందని. చెప్పడంతోనే తాను బయటకు చెప్పాల్సి వచ్చిందని, అంతే తప్ప మరొకటి కాదని చంద్రబాబు తెలిపారు. ఇలాంటివి పున రావృతం కాకుండా సిట్ వేయాలను కున్నామని అన్నారు. దీనిని చాలెంజ్ చేస్తూ వైసీపీ నాయకులు సుప్రీంకోర్టుకు పోయారన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు సంయ క్తంగా సిట్ ఏర్పాటు చేసి విచారణ చే స్తున్నాయని వివరించారు. సిట్ ఇచ్చిన నివేదికల ఆధారంగా చర్యలు ప్రారంభిం చామని వివరించారు. సిట్ కొన్ని కరెక్ష న్లు సూచించిందని ఆ మేరకు టీటీడీకి కరెక్షన్లు పంపామని అన్నారు.

# మీ ఇష్టం... చంపుకోండి

నేపాల్ ప్రభుత్వం ఓ కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలో పంటలను తీవ్రంగా నష్టం చేస్తున్న అడవి పందుల విషయంలో రైతులకు పూర్తి స్వేచ్ఛనిచ్చింది. పొలాల్లోకి వచ్చి నష్టం కలిగిస్తే వాటిని తరిమికొట్టడం, బంధించడం లేదా చంపేయడానికి కూడా అనుమతి ఇస్తూ అధికారిక గెజిట్‌లో నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ ఉత్తర్వులు ఏడాది పాటు అమల్లో ఉంటాయని స్పష్టం చేసింది. సుమారు రెండు వారాల క్రితం కోతుల విషయంలోనూ ఇలాంటి ప్రకటనే చేసిన నేపాల్ ప్రభుత్వం, ఇప్పుడు అడవి పందులను కూడా 'వ్యవసాయానికి నష్టం కలిగించే జంతువుల' జాబితాలో చేర్చింది. వన్యప్రాణుల వల్ల రైతులు భారీగా పంట నష్టపోతుండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖ తెలిపింది. సాగు భూములు తగ్గిపోవడం, అటవీ ప్రాంతం విస్తరించడంతో వన్యప్రాణులకు, మానవులకు మధ్య ఘర్షణ పెరుగుతోంది. దీనివల్ల చాలాచోట్ల పొలాలు బీడుగా మారుతున్నాయి, ఉత్పత్తి పడిపోతోంది. కొన్నిసార్లు ఈ జంతువులు మనుషులపై దాడి చేసి ప్రాణాలు తీసిన సందర్భాలూ ఉన్నాయి. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం, రైతులు ఒక్కరుగా గానీ, అందరూ కలిసి గానీ పంటలకు నష్టం చేసే అడవి పందులను తరిమికొట్టవచ్చు లేదా బంధించవచ్చు. ఒకవేళ బంధిస్తే, దగ్గర్లోని అటవీ శాఖ కార్యాలయానికి అప్పగించి, స్థానిక వార్డు కార్యాలయానికి సమాచారం ఇవ్వాలి. ఒకవేళ వాటిని తరిమే క్రమంలో అడవి పంది చనిపోతే, స్థానిక ప్రభుత్వ ప్రతినిధి, ఐదుగురు స్థానిక సాక్షుల సమక్షంలో దాన్ని ఖననం చేయాలి. ఈ విషయాన్ని కూడా అధికారులకు తెలియజేయాలి.

అయితే, ఈ నిబంధనలు జాతీయ పార్కులు, వన్యప్రాణుల అభయారణ్యాలు, రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతాల్లో వర్తించవని ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రైవేట్ వ్యవసాయ భూములు, పంట కల్లాలు, పెరటి తోటల్లోకి వచ్చే అడవి పందులకు మాత్రమే ఈ నిబంధనలు వర్తిస్తాయి.

# సేవా తీర్థ్‌లో తొలి కేబినెట్ భేటీ...

## కీలక నిర్ణయాలు తీసుకున్న కేంద్రం

-మొదటిపేజీ తరువాయి

ఒక పవిత్ర యాత్రగా భావిస్తామని వివరించారు. ఈ సమావేశంపై ప్రధాని మోదీ ట్వీట్ చేస్తూ.. "స్వదేశీ ఆలోచన, ఆధునిక దృక్పథం, 140 కోట్ల ప్రజల అపార సామర్థ్యంతో భారతదేశాన్ని మరింత శక్తివంతంగా తీర్చిదిద్దేందుకు సంకల్పం చేశాం" అని తెలిపారు. ఈ సమావేశంలో తీసుకున్న ముఖ్య నిర్ణయాల్లో భాగంగా, బాలికల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తూ దేశవ్యాప్తంగా 14 ఏళ్ల బాలికలకు ఉచితంగా గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిరోధక (హెచ్‌పీవీ) 'గర్డాసిల్' టీకాను అందించే కార్యక్రమానికి పచ్చజెండా ఊపారు. అదేవిధంగా, కేరళ రాష్ట్రం పేరును అధికారికంగా 'కేరళం'గా మార్చే ప్రతిపాదనను కూడా కేబినెట్ ఆమోదించింది. మౌలిక సదుపాయాల కల్పనకు ఊతమిస్తూ సుమారు రూ.12,236 కోట్ల విలువైన ప్రాజెక్టులకు కేంద్ర మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందులో అహ్మదాబాద్ మెట్రో ఫేజ్-2 ప్రాజెక్టు, జబల్‌పూర్ రైల్వే లైన్ డబ్లింగ్ పనులు ఉన్నాయి. వీటితో పాటు దేశవ్యాప్తంగా విద్యుత్ సరఫరా వ్యవస్థను బలోపేతం చేసే సంస్కరణలకు కూడా ఆమోదం లభించింది. ప్రభుత్వ పరిపాలన అధికార కేంద్రంగా కాకుండా, ప్రజల సాధికారతకు కేంద్రంగా పనిచేయాలని 'సేవా సంకల్ప్' తీర్మానంలో స్పష్టం చేశారు. 'నాగరిక దేవో భవ' (పౌరుడే దైవం) అనే సూత్రాన్ని పాటిస్తూ, ప్రతి నిర్ణయం 140 కోట్ల ప్రజల సేవకే అంకితమవుతుందని పేర్కొన్నారు. గత దశాబ్దంలో 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తీసుకురావడాన్ని గుర్తుచేస్తూ.. 'రిఫార్మ్ ఎక్స్‌ప్రెస్' వేగంతో భారత్‌ను త్వరలోనే ప్రపంచంలోని టాప్-3 ఆర్థిక శక్తిగా నిలబెట్టేందుకు దృఢ సంకల్పం తీసుకున్నట్లు తెలిపారు. మొత్తం మీద, ఈ సమావేశం 2047 నాటికి 'వికసిత భారత్' లక్ష్యాన్ని సాధించే దిశగా ఒక బలమైన పునాది వేసిందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# తమిళనాడులో సంచలనం.. శశికళ కొత్తపార్టీ

-మొదటిపేజీ తరువాయి

ఆమె ఆవిష్కరించారు. రామనాథపురం సభలో శశికళ ఈ కొత్త రాజకీయ పార్టీ ప్రకటన చేశారు. త్వరలోనే పార్టీ పేరు ప్రకటిస్తానని ఆమె చెప్పారు. రాజకీయాల్లో తన మార్క్ ఏంటో చూపిస్తానని ఆమె చెప్పడం విశేషం. జయలలితను తానే చంపానని దుష్ప్రచారం చేశారని, పళనిస్వామిని సీఎం చేసి తప్పు చేశానని ఆమె పశ్చాతాపం వ్యక్తం చేశారు. తనను పార్టీ నుంచి అవమానకరంగా గెంటేశారని జయలలిత చనిపోయిన సమయంలో జరిగిన పరిణామాలను గుర్తుచేసుకుని శశికళ భావోద్వేగానికి లోనయ్యారు. ఎడప్పాడి పళని స్వామి టార్గెట్?గా శశికళ రాజకీయ పార్టీ కార్యకలాపాలు ఉండనున్నాయని ఈ ప్రకటనతో స్పష్టమైంది.

రామనాథపురం బహిరంగ సభలో అన్నాడీఎంకే బహిష్కృత నాయకురాలు వీకే శశికళ మాట్లాడుతూ, "తమిళనాడులో మనం కొత్త రాజకీయ అధ్యాయాన్ని చూడబోతున్నాం. మేము కొత్త రాజకీయ పార్టీని ప్రారంభించబోతున్నాం. ఈ పార్టీ ద్రావిడ ఉద్యమం.. అన్నాదురై, పురచ్చి తలైవర్ ఎం.జి.ఆర్, పురచ్చి తలైవి అమ్మ చూపిన బాటలో నడుస్తుంది. ఈ రాజకీయ పార్టీ పేదలు, అణగారిన వర్గాలు, సామాన్యుల కోసం పుట్టిన పార్టీ.

రాజకీయం పేరుతో స్వార్థ రాజకీయాల ముసుగులో తమిళనాడుకు చేటు చేస్తున్న శత్రువులను, ద్రోహులను నిర్మూలించే పార్టీ. మా పార్టీ జెండాను రామనాథపురంలో ఆవిష్కరిస్తున్నాను. ఇందుకు నేను సంతోషిస్తున్నాను. నలుపు, తెలుపు, ఎరుపు రంగుల్లో ఉన్న జెండా పెరారిగ్నార్ అన్నా, పురచ్చి తలైవర్ ఎం.జి.ఆర్, పురచ్చి తలైవి అమ్మ (జయలలిత) చిత్రాలను కలిగి గర్వంగా రెపరెపలాడుతుంది. పార్టీ పేరు త్వరలో ప్రకటిస్తాం." అని వీకే శశికళ చెప్పారు.

# బాలికలకు ఉచితంగా హెచ్‌పీవీ టీకా

-మొదటిపేజీ తరువాయి

వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించనుంది. ఇందులో భాగంగా 14 సంవత్సరాల బాలికలకు 'గార్డాసిల్' అనే టీకాను ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా ఇవ్వనుంది. ఈ వ్యాక్సిన్ 4 రకాల గర్భాశయ క్యాన్సర్లను నిరోధిస్తుంది. క్యాన్సర్‌కు కారణమయ్యే హెచ్‌పీవీ టైప్ 16, 18తోపాటు టైప్ 6, 11 రకాల నుంచి ఇది రక్షణ కల్పిస్తుందని ఆరోగ్యశాఖ వర్గాలు వెల్లడించాయి. ప్రభుత్వం నిర్వహించే సార్వజనీన టీకాల కార్యక్రమంలో భాగంగా కాకుండా ఇందుకోసం ప్రత్యేక వ్యాక్సినేషన్ ప్రక్రియ చేపడతారని అధికారులు తెలిపారు. గర్భాశయ క్యాన్సర్ నివారణకు ప్రపంచ స్థాయి వ్యూహంలో భాగంగా హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ చేపట్టాలంటూ ప్రపంచ ఆరోగ్య సంస్థ చేసిన సిఫార్సు మేరకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఒక డోసు వ్యాక్సిన్ అందించడం వల్ల బాలికలకు సంబంధిత వైరస్‌ల నుంచి దీర్ఘకాల రక్షణ లభిస్తుందని దేశీయంగా, అంతర్జాతీయంగా జరిపిన శాస్త్రీయ పరిశోధనల్లో తేలింది. 15ఏళ్ల లోపు బాలికల కోసం ప్రస్తుతం మార్కెట్‌లో అందుబాటులో ఉన్న గార్డాసిల్-4 టీకాను రెండు డోసుల్లో తీసుకోవాల్సి ఉంటుంది.

**ఒక్కో డోసు ధర.3,927. అదే 15 ఏళ్ల వయసు పైబడిన బాలికలు మూడు డోసులు తీసుకోవాలి.**

ఈ వ్యాక్సిన్ 2006లో అందుబాటులోకి రాగా.. ప్రపంచ వ్యాప్తంగా ఇప్పటివరకు 50 కోట్ల డోసులను పంపిణీ చేశారు. దీంతో అనేక దేశాల్లో గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్లు గణనీయంగా తగ్గినట్లు అంచనా. 160 దేశాల్లో ఇప్పటికే ఈ టీకా పంపిణీ కార్యక్రమం అమల్లో ఉండగా.. వీటిలో 90 దేశాలు సింగిల్ డోసుగా అందిస్తున్నాయి. ప్రపంచంలో క్యాన్సర్ బాధితుల సంఖ్యాపరంగా చైనా, అమెరికా తర్వాత భారత్ మూడోస్థానంలో ఉంది. 2040 నాటికి దేశంలో క్యాన్సర్ రోగుల సంఖ్య ఏటా 20 లక్షలకు చేరే అవకాశం ఉందని అంచనా. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా ఏటా 2 కోట్ల మంది క్యాన్సర్ బారిన పడుతుండగా.. వీరిలో 15 లక్షల మంది భారతీయులే ఉన్నట్లు ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి.

# మంత్రి లోకేశ్ పనితీరు పట్ల ఏపీ హైకోర్టు ప్రశంసలు!

-మొదటిపేజీ తరువాయి

తెస్తున్నారని ధర్మాసనం ఘాటుగా వ్యాఖ్యానించింది. కేజీబీవీలకు సంబంధించిన ఓ కోర్టు ధిక్కరణ వ్యాజ్యంపై మంగళవారం జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ హరిహరనాథ శర్మలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా, ఇటీవల ఎన్టీఆర్ జిల్లాలోని ఓ కేజీబీవీలో విద్యార్థినులను ఎలుకలు కొరికిన ఘటనపై మంత్రి లోకేష్ తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవడాన్ని కోర్టు ప్రస్తావించింది. అలాగే, కేజీబీవీ టీచర్ల జీతాల పెంపు, ఖాళీ పోస్టుల భర్తీకి కృషి చేస్తామని మంత్రి ప్రకటించడాన్ని సానుకూల చర్యగా పేర్కొంది. అయితే, మంత్రి స్థాయిలో అంత వేగంగా స్పందన ఉంటే, క్షేత్రస్థాయిలో అధికారులు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. సర్వశిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ) ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావుపై దాఖలైన కోర్టు ధిక్కరణ కేసు విచారణలో భాగంగా ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయి. అధికారులు దాఖలు చేసిన అఫిడవిట్‌పై కూడా కోర్టు అసంతృప్తిని తెలియజేసింది. కొత్తగా అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ, తదుపరి విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది.

# తిరుపతి లడ్డూలో కెమికల్స్ తో చేసిన నెయ్యి వాడారు..

-మొదటిపేజీ తరువాయి

కల్తీ నెయ్యి కేసులో 36 మందిని సిట్ నిందితులుగా తేల్చిందన్నారు. నచ్చిన సంస్థలకు నెయ్యి సరఫరా టెండర్లు కట్టబెట్టారని చెప్పారు. రూల్స్ పక్కన పెట్టి అడ్డగోలుగా వ్యవహరించారని సిట్ చెప్పిందన్నారు. నెయ్యి సరఫరా చేసే సంస్థకు కనీస అర్హతలు లేవని సిట్ వెల్లడించిందన్నారు. తిరుమల కల్తీ నెయ్యి అంశానికి సంబంధించి ఇప్పటికే ప్రభుత్వం వన్ మ్యాన్ కమిటీ ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి దినేష్ కుమార్ ఆధ్వర్యంలో కమిటీ వేసింది. ఈ కమిటీ 45 రోజుల్లోగా నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. కల్తీ నెయ్యి టెండర్ ప్రక్రియ, జరిగిన లోటు పాట్లకు సంబంధించి సమగ్ర అధ్యయనం చేసి రిపోర్ట్ ఇవ్వాలని ఆదేశించింది. కలియుగ దైవం తిరుమల శ్రీవారి లడ్డూలో కల్తీ నెయ్యి కేసుకు సంబంధించి ఇటీవల ఫైనల్ చార్జిషీట్ సమర్పించింది సీబీఐ సిట్. దీంతో ఈ అంశంపై మళ్ళీ పెద్ద ఎత్తున చర్చ మొదలైంది. తిరుమల లడ్డూ తయారీ కోసం వాడిన నెయ్యిలో జంతు కొవ్వు లేదంటూ సిట్ చార్జిషీట్ లో తేలిందని వైసీపీ అంటుంటే.. తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వాడినట్లు చార్జిషీట్లో తేలిందని కూటమి నేతలు అంటున్నారు.

# నేటి నుంచి మోదీ ఇజ్రాయెల్ పర్యటన

-మొదటిపేజీ తరువాయి

పార్లమెంటులో మోదీ ప్రసంగించనున్నారు. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో అనేక అంశాలపై సంప్రదింపులు జరపడంతోపాటు ఆ దేశ అధ్యక్షుడు ఐజాక్ హెర్జోగ్‌తో సమావేశం కానున్నారు. రక్షణ, భద్రత రంగాల్లో సహకారంపై ప్రధానమంత్రుల ప్రతినిధి బృందాలు విస్తృతంగా చర్చించనున్నాయి. నెతన్యాహు బుధవారం రాత్రి ఏర్పాటు చేయనున్న వ్యక్తిగత విందులో మోదీ పాల్గొంటారు. గడచిన తొమ్మిదేళ్లలో మోదీ ఇజ్రాయెల్‌లో పర్యటించడం ఇది రెండోసారి. చివరిసారిగా ఆయన 2017 జులైలో ఆ దేశాన్ని సందర్శించారు. ఇజ్రాయెల్ ప్రధాని సైతం 2018 జనవరిలో భారత పర్యటనకు విచ్చేశారు. తాజా పర్యటనలో భాగంగా ఇరువురు ప్రధానులూ గాజా పరిస్థితితో పాటు పశ్చిమాసియాకు సంబంధించిన అనేక అంశాలపై చర్చించనున్నారు. 41 వేల మంది ప్రవాస భారతీయులు ఇజ్రాయెల్‌లో ఉన్నారు. వారితో మోదీ సంభాషించే అవకాశం ఉంది.

# పీఏసీఎస్ ఉద్యోగుల జీతాలు 20% పెంపు

-మొదటిపేజీ తరువాయి

నేతలు ప్రకటించారు. మంగళవారం సచివాలయంలో పీఏసీఎస్ సంఘాల నేతలతో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, వ్యవసాయశాఖ ఎక్స్‌అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, ఆర్సీఎస్ అహ్మద్‌బాబు, ఆప్కాబ్ ఎండీ రామకృష్ణ తదితరులు ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ ఉద్యోగుల డిమాండ్లపై చర్చించారు. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, పెంచిన ప్రయోజనాల అమలును ఉన్నతస్థాయి కమిటీ త్వరలో ప్రకటిస్తుందని వివరించారు. పీఏసీఎస్ ఉద్యోగుల ఇతర డిమాండ్లను కూడా కమిటీ పరిశీలించి ప్రభుత్వానికి సిఫారసు చేస్తుందని చెప్పారు. పీఏసీఎస్ కంప్యూటరీకరణ, ఈఆర్‌పీలో రియల్‌టైమ్ లావాదేవీలు, డైనమిక్ ఈవోడీ ప్రక్రియలు, హెచ్ఆర్ఎంఎస్ ద్వారా జీతాల చెల్లింపు తదితర కీలక బాధ్యతల్ని ఉద్యోగులు నిబద్ధతతో నిర్వహిస్తున్నారని మంత్రి అచ్చెన్నాయుడు ప్రశంసించారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ ఉద్యోగులు విజయవాడలో మంత్రి అచ్చెన్నాయుడును కలిసి సత్కరించారు.

# అమెరికాతో ఒప్పందం రద్దుకు దమ్ములేని మోదీ

-మొదటిపేజీ తరువాయి

వాణిజ్య ఒప్పందం మన రైతుల గుండెల్లో గుచ్చిన బాణమని, ట్రంప్ సుంకాలు చెల్లవంటూ అమెరికా సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చినందున ఇకనైనా ఒప్పందాన్ని మోదీ రద్దు చేయాలని రాహుల్ డిమాండు చేశారు. ఎప్‌స్టీన్ ఫైళ్లు బయటపడటం, గౌతమ్ అదానీపై అమెరికాలో కేసు పెట్టడంతో అమెరికాతో ఒప్పందాన్ని మోదీ రద్దు చేసుకోలేకపోతున్నారని విమర్శించారు. అదానీపై అమెరికాలో నడుస్తున్న కేసు నిజానికి మోదీపై ఎక్కుపెట్టినదని, ఈ ఒత్తిడిని భరించలేకే అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై ప్రధాని అంగీకారం తెలిపారని ఆరోపించారు. చైనా ట్యాంకులు మన సరిహద్దుల దగ్గరకు వచ్చేస్తున్నాయని తాను హెచ్చరించినా మోదీ ప్రభుత్వం నుంచి ఉలుకూ పలుకూ లేదని మాజీ సైన్యాధిపతి నరవణె తన పుస్తకంలో వెల్లడించారని రాహుల్ తెలిపారు. మోదీ పాలనలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగం ప్రమాదంలో పడ్డాయని, రైతులను బానిసలుగా మార్చేస్తున్నారని ఖర్గే విమర్శించారు.

# దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం...


-మొదటిపేజీ తరువాయి

చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. వీటిలో ముఖ్యంగా, ధృవీకరణ పత్రాలు కలిగిన దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించేందుకు కేబినెట్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. పారిశ్రామికంగా రాష్ట్రాన్ని ముందుకు నడిపే క్రమంలో విశాఖపట్నంలో రూ. 2,387 కోట్లతో సెమీకండక్టర్ పరిశ్రమ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అదేవిధంగా, విశాఖపట్నం, కాకినాడ, రాజమండ్రి, చీరాల, తిరుపతి, సత్యసాయి జిల్లాల్లో పర్యాటక ప్రాజెక్టులతో పాటు సౌర, పవన, హైబ్రిడ్ ఇంధన ప్రాజెక్టులకు కూడా మంత్రి మండలి ఆమోదం తెలిపింది. రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) తీసుకున్న నిర్ణయాలను కూడా కేబినెట్ ధృవీకరించింది. కొల్లేరు అభయారణ్య సరిహద్దుల ఖరారుకు సంబంధించి కేంద్రానికి పంపాల్సిన ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. అలాగే, ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్లను ఈ నెల 28న పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఆ రోజు అసెంబ్లీకి సెలవు ప్రకటించాలని కూడా తీర్మానించారు. సమావేశం సందర్భంగా రాజమండ్రిలో కల్తీ పాల ఘటన, శ్రీకాకుళంలో డయేరియా కేసులు ప్రబలడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. ప్రజారోగ్యంతో చెలగాటమాడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. మరో ఆసక్తికర అంశంగా, అసెంబ్లీలో ఎమ్మెల్యేలు, మంత్రుల ప్రసంగాలను కృత్రిమ మేధ (ఏఐ) సహాయంతో విశ్లేషిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. వ్యవసాయ రంగంలో సాధించిన ప్రగతిపై చర్చకు మంత్రులు పూర్తిస్థాయిలో సిద్ధం కావాలని కూడా సూచించారు. తాజా నిర్ణయాలతో రాష్ట్ర అభివృద్ధి మరింత వేగవంతం అవుతుందని అధికార వర్గాలు భావిస్తున్నాయి.

# యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

నక్కపల్లి ఎస్ఐ సాహిబా అంజుమ్

**నక్కపల్లి, పెన్ సత్తా, ఫిబ్రవరి 24:** యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని నక్కపల్లి ఎస్ఐ షాహిబా అంజుమ్ విద్యార్థులకు సూచించారు. మంగళవారం చినదొడ్డి గల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మత్తు, మాదక ద్రవ్యాల జోలికి వెళ్లరాదని విద్యార్థులకు సూచించారు. అటువంటి చెడు వ్యసనాలకు లోనై జీవితాలను నాశనం చేసుకోవద్దని తెలియజేశారు. వీటివల్ల అలవాటు పడిన వ్యక్తితో పాటు తమ కుటుంబాలు ఇబ్బంది పడవలసి వస్తుందని తెలిపారు. ప్రతి విద్యార్థి బాగా చదువుకుని భవిష్యత్తులో మంచి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని అన్నారు. పిల్లలు గంజాయి వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని లేదంటే జీవితం లో సర్వం కోల్పోతారని చెప్పారు, ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి బాలాజీ, ఆంగ్ల ఉపాధ్యాయులు వై వి రమణ, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగేశ్వరావు, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# వెంకన్న సన్నిధిలో ఏషియన్ పెయింట్స్ పరిశ్రమ ప్రతినిధులు





**నక్కపల్లి, పెన్ సత్తా, ఫిబ్రవరి 24:** కలియుగ దైవం ఉపమాక శ్రీ కల్కి వేంకటేశ్వర స్వామిని ఏషియన్ పెయింట్స్ పరిశ్రమ ప్రతినిధులు మంగళవారం దర్శించుకున్నారు. ఏషియన్ పెయింట్స్ ప్రధాన ప్రతినిధి మౌనిక్ చటర్జీ కి స్వామి వారి సన్నిధిలో ఆలయ ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వరప్రసాదాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పరిశ్రమ నిధులు ద్వారా వెంకటేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులు పర్యవేక్షించారు. ఎషియన్ పెయింట్స్ పరిశ్రమ సిఎస్ఆర్ నిధులతో బందర్ సరస్సు, పెద్ద చెరువులు కి వాకింగ్ ట్రాక్, భక్తులు కూర్చునేందుకు అనువుగా బెంచులు,సోలార్ లైట్స్, చెరువుకి నీరువచ్చే కాలువ పూడికతీత వంటి ఆలయ అభివృద్ధి పనులను పరిశీలించారు. ఆయన వెంట కంపెనీ సి ఎస్ ఆర్ ప్రతినిధులు, నక్కపల్లి పిఏసిఎస్ అధ్యక్షులు కొప్పిశెట్టి బుజ్జి, పార్టీ ప్రెసిడెంట్ కొప్పిశెట్టి శ్రీను, తోలేటి శ్రీను, కొప్పిశెట్టి వాసు పాల్గొన్నారు.

# ఇంటర్ పరీక్షలు కట్టుదిట్టంగా.., కలెక్టర్ కఠిన ఆదేశాలు..



**రంగారెడ్డి జిల్లా, ఫిబ్రవరి 24, పెన్ సత్తా, ఫిబ్రవరి 24:** ఈ నెల 25వ తేదీ బుధవారం నుంచి ప్రారంభమయ్యే ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను ఎలాంటి చిన్న తప్పిదాలకు తావులేకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అధికారులను కఠినంగా ఆదేశించారు. సమన్వయ లోపం, నిర్లక్ష్యం ఏమాత్రం సహించబోమని స్పష్టం చేశారు. మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ అనంతరం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరం నుంచి కలెక్టర్ సంబంధిత ఆర్డీఓలు, ఎంపీడీఓలు, ఆర్సీలు, పోలీస్, విద్యుత్, విద్యాశాఖ మరియు ఇతర శాఖల అధికారులతో టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమన్వయ సమావేశం నిర్వహించారు.

25 నుంచి మార్చి 18 వరకు పరీక్షలు

ఈ నెల 25 నుంచి మార్చి 18వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగనున్నాయి. జిల్లాలో 200 పరీక్షా కేంద్రాల ద్వారా మొదటి సంవత్సరం 84,301 మంది, రెండవ సంవత్సరం 70,171 మంది విద్యార్థులుమొత్తం 1,54,472 మంది పరీక్షలకు హాజరుకానున్నారు. 31 ప్రశ్నపత్రాల స్టోరేజ్ పాయింట్లు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు.

ఎగ్జామ్ సెల్డ వాట్సప్ గ్రూపులు

ప్రతి డివిజన్ స్థాయిలో సంబంధిత అధికారులతో వాట్సప్ గ్రూపులు ఏర్పాటు చేయాలని, ఆర్డీఓ కార్యాలయాల్లో ప్రత్యేక ఎగ్జామ్ సెల్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పరీక్ష విధులు నిర్వహించే ప్రతి అధికారి బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.


సీసీ కెమెరాలుఉ మాస్ కాపీయింగ్‌కు చెక్

ప్రతి పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి మాస్ కాపీయింగ్‌కు తావులేకుండా చూడాలని స్పష్టం చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఉండాలని, పరీక్ష సమయంలో జీరాక్స్ కేంద్రాలు మూసివేయాలని పోలీస్ శాఖకు సూచించారు.

విద్యార్థులకు సౌకర్యాలు తప్పనిసరి

విద్యార్థులు సమయానికి కేంద్రాలకు చేరుకునేలా ఆర్టీసీ బస్సులు నడపాలని, కేంద్రాల వద్ద ఫస్ట్ ఎయిడ్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అవసరమైన మందులతో మెడికల్ పాయింట్లు ఏర్పాటు చేయాలని వైద్యశాఖను ఆదేశించారు. విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ శాఖకు, జవాబు పత్రాల రవాణా సక్రమంగా జరగాలని పోస్టల్ శాఖకు సూచించారు. పరీక్షా కేంద్రాల్లో మంచినీరు, ఫ్యాన్లు, టాయిలెట్లు సక్రమంగా ఉండాలని, ఎవరూ మొబైల్ ఫోన్లు లేదా ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురాకుండా కట్టుదిట్టంగా తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. ఇంటర్ పరీక్షలు జిల్లాకు ప్రతిష్టాత్మకమైనవని, ఎక్కడా చిన్న పొరపాటు చోటుచేసుకోకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని కలెక్టర్ గట్టిగా హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆర్డీఓలు జగదీశ్వర్ రెడ్డి, అనంత్ రెడ్డి, సరిత, మున్సిపల్ కమిషనర్లు, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వెంక్యా నాయక్, డీఈఓ సుసిందర్ రావు, వైద్య ఆరోగ్య శాఖ అధికారి లలితా దేవి, పోలీస్, పోస్టల్, ఆర్టీసీ, విద్యుత్ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ ఎగ్జామ్స్.. సెంటర్ అడ్రస్ కోసం ఇలా చేయండి!




**రంగారెడ్డి జిల్లా, పెన్ సత్తా, ఫిబ్రవరి 24:** రేపటి నుంచి ప్రారంభమయ్యే ఇంటర్మీడియట్ పరీక్షలకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. విద్యార్థులు తప్పనిసరిగా ఉదయం 8:30 గంటలలోపు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ప్రత్యేకంగా హైదరాబాద్ వంటి మహానగరాల్లో ట్రాఫిక్ తీవ్రంగా ఉండే అవకాశం ఉంది. కాబట్టి ముందుగానే బయలుదేరేలా ప్రయాణాన్ని ప్లాన్ చేసుకోవాలి. చివరి నిమిషం హడావుడి వల్ల ఇబ్బందులు తలెత్తే అవకాశముంది. సెంటర్ అడ్రస్ తెలుసుకోవడం ఇలా.., హాల్ టికెట్‌పై ఉన్న ౹ు= కోడ్‌ను మొబైల్ ఫోన్‌తో స్కాన్ చేయండి. స్కాన్ చేసిన వెంటనే పరీక్షా కేంద్రం లొకేషన్ డైరెక్ట్‌గా మ్యాప్‌లో ఓపెన్ అవుతుంది. అక్కడి నుంచి మార్గాన్ని ముందుగానే చెక్ చేసుకుని ప్రయాణ సమయాన్ని అంచనా వేసుకోండి. విద్యార్థులు హాల్ టికెట్, అవసరమైన స్టేషనరీ ముందురోజే సిద్ధం చేసుకోవడం మంచిది. ఎలక్ట్రానిక్ పరికరాలు, ముఖ్యంగా మొబైల్ ఫోన్లు పరీక్షా కేంద్రంలోకి అనుమతి ఉండదని గుర్తుంచుకోండి. ఇంటర్ విద్యార్థులున్న తల్లిదండ్రులకు ఈ సమాచారాన్ని తప్పక షేర్ చేయండిడ ఒక చిన్న జాగ్రత్త పెద్ద ఇబ్బందిని తప్పించగలదు!

# ఆడబిడ్డ పెళ్లికి అన్నలా అండగా..

- మాజీ కౌన్సిలర్, కాంగ్రెస్ నాయకులు, జిఎస్ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు గ్యారాల శ్రీనివాస్ గౌడ్..



**రంగారెడ్డి జిల్లా, ఎల్బీనగర్, పెన్ సత్తా, ఫిబ్రవరి 24:** నాగోల్ జిహెచ్ఎంసీ పరిధిలోని కుంట్లూర్ రాజీవ్ గృహకల్పలో నివాసం ఉంటున్న పామోజు బ్రహ్మచారిసౌభాగ్య దంపతుల పెద్ద కుమార్తె వివాహానికి మాజీ కౌన్సిలర్, కాంగ్రెస్ నాయకులు, జిఎస్ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు గ్యారాల శ్రీనివాస్ గౌడ్ రూ.10,000ల ఆర్థిక సహాయం అందజేశారు. వివాహానికి ముందు కుటుంబాన్ని కలిసి సహాయం అందించిన ఆయన, ఆడబిడ్డ పెళ్లి ప్రతి కుటుంబానికి భావోద్వేగభరితమైన బాధ్యత అని పేర్కొన్నారు. ఇలాంటి సందర్భాల్లో తాను అన్నలాగా అండగా నిలబడటం తన సామాజిక బాధ్యతగా భావిస్తున్నట్లు తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు తన వంతు సహాయం ఎల్లప్పుడూ కొనసాగుతుందని స్పష్టం చేశారు. “సమాజంలో ఎవరికైనా అవసరం ఉంటే జిఎస్ సేవా సమితి ముందుంటుంది. ముఖ్యంగా ఆడబిడ్డల పెళ్లిళ్ల విషయంలో ఎవరూ ఒంటరితనంగా భావించకూడదు” అని ఆయన అన్నారు. స్థానిక ప్రజలు గ్యారాల శ్రీనివాస్ గౌడ్ సేవలను అభినందిస్తూ, ఇలాంటి సహాయ చర్యలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు.అవసరం వచ్చిన ప్రతి ఆడబిడ్డకు జిఎస్ సేవా సమితి అండగా నిలుస్తుందని చైర్మన్ గ్యారాల శ్రీనివాస్ గౌడ్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, స్థానిక నాయకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.?

# పసి బిడ్డను హత్య చేసిన అగ్రకుల దురహంకారులను కఠినంగా శిక్షించాలి

- సీఎం నోరు విప్పాలి
- హంతకులందరిని తక్షణమే రిమాండ్ చేయాలి

**పెన్ సత్తా, ఫిబ్రవరి 24:** నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో రెండు నెలల పసిబిడ్డను అత్యంత క్రూరంగా అమానవీయంగా కాలితో తన్ని హత్య చేసిన ఆ గ్రామ అగ్రకుల పెత్తందారులు శ్రీనివాస్ రెడ్డి మధుసూదన్ రెడ్డి సతీష్ రెడ్డి శ్రీకాంత్ రెడ్డి కన్నిరెడ్డి తుకారం రెడ్డి మరికొందరిపై ఎస్సీ ఎస్టీ అత్యాచార నిరోధక చట్టంతోపాటు హత్యా నేరం కింద కేసు నమోదు చేసి 8మంది హంతకులను 24 గంటల్లో తక్షణమే రిమాండ్ చేయాలని కేవిపిఎస్ నర్సింహులపేట మండల కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు.అనంతరం కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి మందుల యాకూబ్ మాట్లాడుతూ

హంతకులందర్నీ 24 గంటల లోపు తక్షణమే అరెస్టు చేయాలని కేసు నమోదు చేయాలని అగ్రకుల పెత్తందారుల ఆగడాలు నశించాలని పెద్దపెట్టను నినాదాలు చేశారు

వారు మాట్లాడుతూ పండగలు ఉత్సవాలలో కులవివక్ష అగ్రకుల దురహంకారంతో ప్రజల మధ్య కులవిద్వేషాలు సృష్టంచడం, దేవుడి దగ్గర అందరూ సమానము కాదని అహంకారము ప్రదర్శించడంవల్ల ఈ ఘటన జరిగిందన్నారు దేవుని దగ్గరికి వెళ్లడానికి 100 రూపాయలు ఫీజు ఎందుకు చెల్లించాలని ప్రశ్నించిన పాపానికి, చెల్లిస్తాం కానీ రషీదు ఇవ్వండని అడిగినందుకు సుమారు మూడున్నర గంటలపాటు గణేష్ అనే రజక యువకుడిని చితక బాధారని చెప్పారు. తన భర్తను కొట్టవద్దని తన తమ్ముడిని కొట్టవద్దని గణేష్ అక్క కీర్తి భార్య మౌనిక ఎంతగా బ్రతిమిలాడిన కాళ్లు మొక్క డానికి ప్రయత్నం చేసిన కాళ్లతో తన్నారు తప్ప కనికరించలేదు రెండు నెలల పసిబిడ్డ ఉంది నా భర్తను కొట్టకండి చంపకండి అని వేడుకున్న చివరికి ఏమాత్రం కనికరం లేకుండా అమానవీయంగా మానవ మృగంలా రెండు నెలల పసిబిడ్డపై కూడా కాలితో తన్ని క్రూరంగా పసిబిడ్డను హత్య చేశారని చెప్పారు ఈ ఘటన సమాజం సిగ్గుతో తలదించుకునే విధంగా మానవత్వాన్ని మంటగలిపే విధంగా ఉందన్నారు సంఘటన ఈ నెల 18న జరిగితే పోలీసులు బాధితులే అగ్రకుల పెత్తందారులపైన దాడి చేసినట్లుగా బాధితులపై కేసులు నమోదు చేయడం సిగ్గుచేటు అన్నారు బాధితులను వెంటబడి వెంబడించి దాడి చేసి చెప్పరాని బూతులు తిట్టి కాలుతో తన్ని పసిబిడ్డను హత్య చేసిన హంతకులను మాత్రం పోలీసులు ఒక కంటకనిపెట్టారని చెప్పారు చట్టం ముందు అందరూ సమానులే అని చెప్పే పోలీసులు హంతకులకు న్యాయం బాధితులకు అన్యాయం చేసే విధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు బాధితులకు న్యాయంచేసే క్రమంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. డిఎస్పీ శ్రీనివాస్ ముందు హంతకులపై కేసు నమోదు చేయాల్సి ఉండగా బాధితులపై కేసు పెట్టారని చెప్పారు. 8 మందిపై ఫిర్యాదు చేస్తే నలుగురిని మాత్రమే అరెస్టు చేశారని మిగతా వాళ్లను కాపాడేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయనే అనుమానాలు ఉన్నాయన్నారు హత్య జరిగితే ముందస్తు మర్డర్ గా అటెంప్ట్ మర్డర్ గా కేసు నమోదు చేయడం విడ్డూరమన్నారు. హత్య జరిగిందని పసిబిడ్డను చంపారని క్లియర్ గా సభ్య సమాజం గుర్తించినప్పటికీ పోలీసులు గుర్తించలేదన్నారు సీఎం సొంత జిల్లాలో ఈ ఘటన జరిగితే ముఖ్యమంత్రి ఎందుకు మౌనం పాటిస్తున్నారని విమర్శించారు తక్షణమే సీఎం నోరు విప్పాలని డిమాండ్ చేశారు తక్షణమే హత్యా నేరం కింద 103 సెక్షన్ పెట్టాలని డిమాండ్ చేశారు. గునిగంటి మోహన్ బానోత్,సర్వన్,నకిరకంటి స్వామి,వెంకన్న,ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



## ఏన్కూర్ జిపి లో ఏఎల్ఎంఎస్ సి కమిటీ ఏర్పాటు

- అంగన్వాడి కేంద్రాల సేవలపై సమీక్ష





**పెన్ సత్తా, ఫిబ్రవరి 24:** ఏన్కూర్ గ్రామపంచాయతీ పరిధిలో అంగన్వాడి స్థాయి మానిటరింగ్ మరియు సహాయ కమిటీ (ఏఎల్ఎంఎస్ సి)కి చెందిన 11 మంది కొత్త సభ్యులతో కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ సమావేశానికి ఎంపీడీవో భాగ్యశ్రీ అధ్యక్షత వహించారు.
ఈ సమావేశంలో కమిటీ సభ్యులు అంగన్వాడి కేంద్రాల్లో జరుగుతున్న పలు కార్యక్రమాలపై తల్లుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ముఖ్యంగా అంగన్వాడి భవన నిర్మాణం, ఎస్ ఏ ఎం మరియు ఎంఏఎం పిల్లల పరిస్థితి, అంగన్వాడి కేంద్రాల్లో ప్రతిరోజూ నిర్వహిస్తున్న ప్రీ-స్కూల్ కార్యక్రమాలను తల్లులు ఎలా వినియోగించుకుంటున్నారనే అంశాలపై చర్చించారు.
అంగన్వాడి కేంద్రాల్లో గర్భిణీలు మరియు బాలింతలకు అందించే పోషకాహారాన్ని కేంద్రంలోనే తీసుకోవాలని సూచించారు. అలాగే హక్కుదారులైన ప్రతి ఒక్కరూ అంగన్వాడి కేంద్రాల్లో అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని తల్లులకు అవగాహన కల్పించారు.
ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఏన్కూర్ 4 మరియు 6 అంగన్వాడి కేంద్రాలను సందర్శించి పిల్లలతో మాట్లాడారు. అలాగే ఏన్కూర్ 2, 3, 5 గ్రామపంచాయతీ పరిధిలోని మొత్తం ఐదు అంగన్వాడి కేంద్రాల పనితీరుపై సమీక్ష నిర్వహించారు. తల్లులను నేరుగా సంప్రదించి కేంద్రాల వినియోగంపై వివరాలు తెలుసుకున్నారు.
ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ బక్కమ్మ, అంగన్వాడి టీచర్లు సుశీల,అరుణకుమారి పాల్గొన్నారు.

## గోదావరి పుష్కరాలకు అవసరమైన ఏర్పాట్ల ప్రతిపాదనలు సమర్పించాలి.

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (రెవెన్యూ, దేవాదాయ) శైలజ రామయ్యర్..



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పెన్ సత్తా, ఫిబ్రవరి 24:** రాష్ట్రంలో నిర్వహించనున్న గోదావరి పుష్కరాలకు అవసరమైన అన్ని ఏర్పాట్లకు సంబంధించిన సమగ్ర ప్రతిపాదనలు తక్షణమే సిద్ధం చేసి సమర్పించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (రెవెన్యూ, దేవాదాయ) శైలజ రామయ్యర్ ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గోదావరి నది తీర ప్రాంత జిల్లాల కలెక్టర్లు మరియు సంబంధిత శాఖల అధికారులతో గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పుష్కరాల నిర్వహణకు సంబంధించి ప్రతి అంశంపై పూర్తి స్థాయి ప్రణాళికతో నివేదికలు తయారు చేయాలని సూచించారు. పుష్కర స్నానానికి రాష్ట్రం నలుమూలల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. పారిశుద్ధ్యం, శుద్ధి చేసిన త్రాగునీటి సరఫరా, తాత్కాలిక వైద్య శిబిరాల ఏర్పాటు, అంబులెన్స్ సదుపాయం, గజ ఈతగాళ్ల నియామకం, బలమైన పోలీసు బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, తాత్కాలిక మరుగుదొడ్లు, విద్యుత్ మరియు వెలుగుల ఏర్పాట్లు తదితర అన్ని మౌలిక సదుపాయాల కల్పనపై సమగ్ర ప్రతిపాదనలు రూపొందించాలని ఆదేశించారు.
ముఖ్యంగా భద్రాచలంలో గోదావరి పుష్కరాల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లపై సమగ్ర నివేదిక సమర్పించాలని సూచించారు. భద్రాచలం గోదావరి తీరం వద్ద ఉన్న పుష్కర ఘాట్లను పరిశీలించి అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధికి తక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు.
ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పాల్గొని మాట్లాడుతూ, జిల్లాలో గోదావరి పుష్కరాలు ఎటువంటి లోటుపాట్లకు తావులేకుండా నిర్వహించేందుకు అన్ని శాఖల సమన్వయంతో ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. భద్రాచలం గోదావరి తీరంలో పుష్కర స్నానానికి సమీప జిల్లాల నుంచే కాకుండా రాష్ట్రం మరియు ఇతర ప్రాంతాల నుంచి కూడా అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తారని, అందుకు అనుగుణంగా విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు.
ఈ సమావేశంలో భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం ఈవో దామోదర్ రావు, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, పంచాయతీ అధికారులు మరియు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సీఎం కప్ విజయాలు జిల్లాకు గర్వకారణం.

**జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్...**



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పెన్ సత్తా, ఫిబ్రవరి 24:** రాష్ట్ర యువజన సర్వీసులు మరియు క్రీడా శాఖ ఆధ్వర్యం లో నిర్వహించిన సీఎం కప్ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రీడాకారులు సాధించిన విజయాలు జిల్లాకు గర్వకారణమని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. రాష్ట్ర స్థాయిలో జరిగిన ఈ పోటీలలో జిల్లా నుండి పాల్గొన్న క్రీడాకారులు వివిధ క్రీడా విభాగాలలో ప్రతిభ కనబరచి మొత్తం 54 పతకాలు సాధించడం విశేషమని అన్నారు .
ఈ సందర్భంగా మంగళవారం ఐడీఓసి కార్యాలయం లో జిల్లా కలెక్టర్ పతక విజేతలను అభినందించి, వారి కృషిని ప్రశంసించారు. క్రీడాకారులు సాధించిన 15 బంగారు, 19 వెండి, 20 కాంస్య పతకాలు జిల్లాకు రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక గుర్తింపును తీసుకువచ్చాయని తెలిపారు. ముఖ్యంగా అథ్లెటిక్స్ విభాగంలోనే 31 పతకాలు సాధించడం జిల్లాలో క్రీడా అభివృద్ధి దిశగా సానుకూల పరిణామమని తెలిపారు .
గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చిన యువ క్రీడాకారులు కూడా సమానంగా ప్రతిభ చాటుకోవడం అభినందనీయమని, క్రీడల ద్వారా యువతలో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, జట్టు భావన పెంపొందుతాయని కలెక్టర్ అన్నారు. క్రీడలు విద్యతో పాటు సమాన ప్రాధాన్యత పొందాలని, పాఠశాల స్థాయిలోనే ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని సూచించారు.
క్రీడాకారుల విజయాలలో కోచ్‌లు, శిక్షకులు, పాఠశాలల ప్రిన్సిపాళ్లు, వ్యాయామ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, జిల్లా యువజన, క్రీడా శాఖ అధికారుల సహకారం ప్రశంసనీయమని కలెక్టర్ తెలిపారు. భవిష్యత్తులో జాతీయ మరియు అంతర్జాతీయ స్థాయి పోటీల్లో కూడా జిల్లా క్రీడాకారులు రాణించేలా అవసరమైన శిక్షణ, మౌలిక వసతులు కల్పించేందుకు జిల్లా పరిపాలన కట్టుబడి ఉందని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ స్పష్టం చేశారు.
ఈ కార్యక్రమంలో జిల్లా యువజన మరియు క్రీడల అధికారి యం. పరంధామ రెడ్డి, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ నరేష్, ట్రైబల్ వెల్ఫేర్ ఉమెన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ అనురాధ, అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రటరీ మహిధర్, కొమరారం వెంకటనారాయణ (ఏఎస్ఓ, ట్రైబల్ వెల్ఫేర్), బాక్సింగ్ అసోసియేషన్ సెక్రటరీ మట్టపర్తి రమేష్, టైక్వాండో సెక్రటరీ రమేష్, పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ సెక్రటరీ వెంకటరామిరెడ్డి, మంజిలాల్ (పీడీ), నాగలక్ష్మి (పీడీ), చైతన్య (పీడీ), వాసు, నాగేందర్, నాగరాజు, మాలికార్జున్, గిరిప్రసాద్, కావేటి రమేష్, రఘు తదితరులు పాల్గొన్నారు.

## మేయర్ కార్పొరేటర్ లని సన్మానించిన మహిళా సమైక్య...



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పెన్ సత్తా, ఫిబ్రవరి 24:** శేషగిరి భవన్లో సిపిఐ ఎన్ఎఫ్ఐ డబ్ల్యు మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నుకోబడిన సిపిఐ మేయర్ మూడ్ గణేష్ డివిజన్ కార్పొరేటర్స్ మునిగడప పద్మ, పోలమూరి ధనలక్ష్మి, గడ్డం శాంతి ప్రియ, పడాల ఆకాంక్ష, మద్దాల హరిత, శ్యామల మొదలైన వారికి మహిళ సమాఖ్య ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించడం జరిగినది, ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు,సాబీర్ పాషా వీరితోపాటు మహిళల అందరి సహకారంతో నేను గెలవడం జరిగినది నేను ప్రజల మనిషిని మీకు ఏ టైంలో ఎలాంటి సమస్య వచ్చిన మీ అందరికీ అందుబాటులో ఉంటానని అలాగే కూనంనేని సాంబశివరావు, సాబీర్ పాష అడుగుజాడల్లో నడుస్తూ వీరి ఆశయాలతో మన భద్రాద్రి జిల్లా కొత్తగూడెం కార్పొరేషన్ ను మరింత అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తానని మీ అందరికీ తెలియజేస్తున్నాను, ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మీ కుమారి, ఆర్గనైజ్ సెక్రటరీ కర్షరత్నకుమారి ,సహాయ కార్యదర్శి మామిడాల ధనలక్ష్మి,టౌన్ ఆర్గనైజ్ సెక్రటరీ కైసర్ , ప్రజానాట్య మండలి జిల్లా నాయకురాలు దార్ల లక్ష్మి, అనసూయ, మాజీ వార్డు నెంబర్ శాంతి, లత, లక్ష్మి వీరందరి ఆధ్వర్యంలో వారిని ఘనంగా సన్మానించడం జరిగినది, ఈ సందర్భంగాభద్రాద్రి కొత్తగూడెం శేషగిరి భవన్లో సిపిఐ ఎన్ఎఫ్ఐ డబ్ల్యు మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నుకోబడిన సిపిఐ మేయర్ మూడ్ గణేష్ కి కార్పొరేటర్స్ కి మహిళ సమాఖ్య ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సన్మానించడం జరిగినది, ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనం నేని సాంబశివరావు, సాబీర్ పాషా వీరితోపాటు మహిళల అందరి సహకారంతో నేను గెలవడం జరిగినది. నేను ప్రజల మనిషిని 60 డివిజన్ల ప్రజలకు ఏ టైంలో ఎలాంటి సమస్య వచ్చిన ఎలాంటి అభివృద్ధి పనులకైనా మీ అందరికీ అందుబాటులో ఉంటానని అలాగే కూనంనేని సాంబశివరావు, సాబీర్ పాష అడుగుజాడల్లో నడుస్తూ వీరి ఆశయాల తో అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తానని మీ అందరికీ తెలియజేస్తున్నాను, ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మీ కుమారి, ఆర్గనైజ్ సెక్రటరీ కర్షరత్నకుమారి , సహాయ కార్యదర్శి మామిడాల ధనలక్ష్మి ,మిడ్ డే మీల్స్ జిల్లా నాయకురాలు ఎస్ విజయలక్ష్మి, ప్రజానాట్య మండలి జిల్లా నాయకురాలు దార్ల లక్ష్మి, అనసూయ, మాజీ వార్డు నెంబర్ శాంతి, లత, లక్ష్మి వీరందరి ఆధ్వర్యంలో వారిని ఘనంగా సన్మానించడం జరిగినది, ఈ సందర్భంగా మేయర్ మూడ్ గణేష్ మహిళలను గౌరవించడం మన సంప్రదాయం మీ అందరి సహకారంతో గెలిచిన వాడిని అంటూ ప్రతి ఒక్క మహిళను శాలువాతో సత్కరించారు.

## జీవితంలో స్వీయ క్రమశిక్షణ కలిగి ఉంటే సులభంగా లక్ష్యాలను సాధించవచ్చు.

**ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలి : ఎస్పీ రోహిత్ రాజు**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పెన్ సత్తా, ఫిబ్రవరి 24:** కొత్తగూడెం సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన అర్రైవ్ - అలైవ్ అవగాహనా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్పీ. రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలను అరికట్టడానికి,ప్రజలలో ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించాలనే దృఢ సంకల్పంతో రాష్ట్ర వ్యాప్తంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమమే అర్రైవ్ - అలైవ్ -2026
అని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అన్నారు.
రోడ్డు ప్రమాదాలను నియంత్రించడానికి ప్రజలకు అవగాహన కల్పించడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన అర్రైవ్ - అలైవ్ క్యాంపెయిన్ -2026 రెండవ విడుతలో భాగంగా మంగళవారం కొత్తగూడెం క్లబ్ నందు విద్యార్థిని, విద్యార్థులకు అవగాహన కల్పించారు. కొత్తగూడెం డిఎస్పీ ఆది నారాయణ ఆధ్వర్యంలో సబ్ డివిజన్ పోలీసులు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో విద్యార్థినీ,విద్యార్థులు పాల్గొన్నారు. సుమారుగా 3000 మంది విద్యార్థిని, విద్యార్థులు వివిధ కళాశాలలు,పాఠశాలల నుండి హాజరయ్యారు. ముందుగా మిమిక్రీ కళాకారుడైన రమేష్ విద్యార్థులను తనదైన శైలిలో ఉత్సాహపరిచారు.
ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ హెల్మెట్ వినియోగం,సీటు బెల్ట్ ప్రాధాన్యత,డిఫెన్సివ్ డ్రైవింగ్ నియమాల గురించి వివరించారు.రోడ్డు భద్రతా నియమాలను పాటించడంలో స్వీయ క్రమశిక్షణ కలిగి ఉంటే చాలావరకు రోడ్డు ప్రమాదాలను అరికట్టవచ్చని అన్నారు.రోడ్డుపై విధులలో ట్రాఫిక్ పోలీసులు ఉన్నా,లేకపోయినా వాహనాలను నడిపేటప్పుడు నియమ,నిబంధనలను ప్రతి ఒక్కరూ కచ్చితంగా పాటించే విధంగా సివిక్ సెన్స్ ను కలిగి ఉండాలని కోరారు.జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలను గౌరవించి తమ ప్రాణ భద్రతతో పాటు,ఇతరుల భద్రతకు కూడా సహకరించాలని జిల్లా ఎస్పీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.డ్రంక్ అండ్ డ్రైవ్,ర్యాష్ డ్రైవింగ్,సెల్ఫోన్ డ్రైవింగ్,రాంగ్ రూట్,సిగ్నల్ జంపింగ్,ఓవర్ లోడ్ వలన కలిగే ప్రమాదాల గురించి వివరించారు. విద్యార్థి దశలో ప్రతి ఒక్కరూ తమ తల్లీదండ్రుల ఆశయాలకు తగ్గట్టుగా నడుచుకుంటూ మంచిగా చదువుకుని క్రమశిక్షణతో ఉన్నతస్థాయికి ఎదగాలని అకాక్షించారు.
అనంతరం సైబర్ నేరాలపై ఎస్పీ అవగాహన కల్పించారు.అత్యాశకు పోయి త్వరితగతిన డబ్బు ను సంపాదించాలనే ఆలోచనతో చాలామంది సైబర్ నేరాల బారిన పడి కష్టపడి సంపాదించిన నగదును కోల్పోతున్నారని తెలిపారు. చదువుకున్నవారే ఎక్కువ మంది సైబర్ నేరాలు మారిన పడుతున్నారని తెలిపారు. ఓటీపి,హనీ ట్రాప్, ఆన్లైన్ ట్రేడింగ్, సోషల్ మీడియాల ద్వారా ప్రస్తుతం జరుగుతున్న సైబర్ నేరాల గురించి వివరించారు.
గంజాయి సేవిస్తూ పట్టుబడితే జైలుకే
ప్రభుత్వ నిషేధిత గంజాయిని ఎవరైనా సరఫరా చేస్తున్నట్లుగానీ,సేవిస్తున్నట్లు గానీ తెలిస్తే వెంటనే పోలీసువారికి సమాచారం అందించాలని ఎస్పీ సూచించారు. చాలామంది యువత గంజాయి మత్తుకు బానిసలై తమ అమూల్యమైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. ఎవరైనా గంజాయి సేవిస్తూ పోలీసులు పట్టుబడితే కేసు నమోదు చేయడమే కాకుండా జైలుకు పంపడం జరుగుతుందని తెలిపారు.అనంతరం రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తామని కార్యక్రమంలో పాల్గొన్నారు ప్రతి ఒక్కరూ ప్రతిజ్ఞ చేశారు.
ఈ కార్యక్రమంలో ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, వన్టౌన్ సిఐ కరుణాకర్,3 టౌన్ సిఐ ఇంద్రసేనారెడ్డి,ఎస్సైలు రమణారెడ్డి,ప్రవీణ్,రమాదేవి,విజయ,రాకేష్,విజయసింహారెడ్డి, ఉమ మరియు సిబ్బంది పాల్గొన్నారు.



## కొత్వాల విమలాదేవిని సన్మానించిన మెప్మా సిబ్బంది...

- మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయాలి...
- 46వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి...



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/పాల్వంచ పెన్ సత్తా, ఫిబ్రవరి 24:** మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయాలనీ 46వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి అన్నారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ లోని పాత పాల్వంచ 46వ డివిజన్ నుండి కార్పొరేటర్ గా ఎన్నికైన రాష్ట్ర మార్క్ఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు సతీమణి కొత్వాల విమలాదేవి ని మంగళవారం పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మెప్మా ఆధ్వర్యంలో శాలువా, బొకే, స్వీట్లతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా కొత్వాల విమలాదేవి మాట్లాడుతూ మహిళలకు ఉపాధి అవకాశాలు, తద్వారా ఆర్థిక స్వలంబన లభించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మెప్మా ఏడీఎంసి చంద్రశేఖర్ బాబు, కమ్యూనిటీ ఆర్గనైజర్స్ శాంత కుమారి, నాగమణి, సరితా, అమ్మ దీవెన పట్టణ సమాఖ్య అధ్యక్షురాలు ప్రవళిక, స్వరూప, నాగమణి, సునీతా, సమాఖ్య ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## పీఎం శ్రీ హైస్కూల్లో ఎగ్జామ్ పాడ్స్ ఇచ్చిన, మాజీ సర్పంచ్ బుడ్డ స్వర్ణలత భాగ్యరాజ్




**చేగుంట : పెన్ సత్తా, ఫిబ్రవరి 24:** చేగుంట మండలం చందాయిపేట గ్రామంలో మాజీ సర్పంచ్ బుడ్డ స్వర్ణలతభాగ్యరాజ్, గ్రామ ప్రజల ఆశీర్వాదంతో పీఎం శ్రీ జిల్లా పరిషత్ హై స్కూల్ లో చిన్న సహాయంగా 85 మంది విద్యార్థులకు ఎగ్జామ్స్ పాడ్స్ ఇవ్వడం జరిగింది మాజీ సర్పంచ్ మాట్లాడుతూ తన గ్రామంలో ప్రతిసారి హై స్కూల్లో ఎగ్జామ్స్ పాడ్స్ అందజేయడం మరియు ఈ సంవత్సరం గాజ పాస్ అయినవారికి 550 మార్కులు పైన వచ్చిన వాళ్లకు 2000 రూపాయలు బహుమతిగా ప్రకటించడం జరిగింది ఈ చిన్న సహాయం విద్యార్థులకు మంచిగా చదవడానికి ప్రోత్సాహం నా వంతు చిన్న సహాయం గ్రామ ప్రజల ఆశీర్వాదంతో ప్రకటించాను. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు కిషన్ సార్.విట్టల్ రెడ్డి. నర్సింలు. దామోదర్. గిరిధర్. శ్రీనివాస్. శంకర్. సలీం.రాములు. స్వప్న. సౌజన్య.వీణ. సంతోషిమాత. లక్ష్మణ్. బంగారయ్య, తదితరులు పాల్గొన్నారు

# పరీక్షా కేంద్రాల్లో మౌలిక వసతులు పూర్తిగా కల్పించాలి.




- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే. రామకృష్ణ రావు.
- ఇంటర్, పదో తరగతి పరీక్షల నిర్వహణపై సమీక్షా సమావేశంలో కీలక ఆదేశాలు.
- ఇంటర్ పరీక్షల నిర్వహణకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తి జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పెన్ సత్తా, ఫిబ్రవరి 24:** రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న ఇంటర్మీడియట్ మరియు పదో తరగతి ( ఎస్ ఎస్ సి) పబ్లిక్ పరీక్షల నిర్వహణపై అన్ని జిల్లాల కలెక్టర్ లతో మంగళవారం రాష్ట్ర స్థాయి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించ బడింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే. రామకృష్ణ రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశం లో విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ యోగిత రానా, ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య హైదరాబాద్ నుండి పాల్గొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఐడీఓసీ కార్యాలయం సమావేశ మందిరం నుండి జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ, రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఇంటర్ మరియు పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సమగ్ర చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రశ్నాపత్రాల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద 24 గంటల పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని, సీసీటీవీ పర్యవేక్షణను కట్టుదిట్టం చేయాలని సూచించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను చురుకుగా పనిచేయించేలా చర్యలు తీసుకోవాలని, చీఫ్ సూపరింటెండెంట్లు తమ బాధ్యతలను కచ్చితంగా నిర్వర్తించాలని స్పష్టం చేశారు. పదవ తరగతి పరీక్ష కేంద్రాల బయట విద్యార్థులు, సిబ్బంది సౌకర్యార్థం క్లాస్ రూమ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద 163 బి సెక్షన్ ను అమలు చేయాలని అన్నారు. పరీక్షావ కేంద్రాల వద్ద అవసరమైన కిట్లు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా, అవసరమైన ఫర్నిచర్ వంటి మౌలిక వసతులు సమృద్ధిగా ఉండేలా జిల్లా యంత్రాంగం ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పరీక్షల నిర్వహణలో ఎటువంటి నిర్లక్ష్యం వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన ఈ పరీక్షలను అన్ని శాఖలు సమన్వయంతో విజయవంతంగా నిర్వహించాలని దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మాట్లాడుతూ, జిల్లాలో రేపటి నుండి నిర్వహించనున్న ఇంటర్మీడియట్ వార్షిక పబ్లిక్ పరీక్షలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు తెలిపారు. ఫిబ్రవరి 25, 2026 నుండి మార్చి 18, 2026 వరకు ప్రతిరోజు ఉదయం 9.00 గంటల నుండి మధ్యాహ్నం 12.00 గంటల వరకు ప్రథమ మరియు ద్వితీయ సంవత్సర పరీక్షలు నిర్వహించబడనున్నాయని తెలిపారు. జిల్లాలో మొత్తం 18,685 మంది విద్యార్థులు హాజరు కానుండగా, 37 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా, వైద్య సదుపాయాలు, సీసీటీవీ పర్యవేక్షణ, ప్రశ్నాపత్రాల భద్రతకు ప్రత్యేక ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రశ్నాపత్రాల రవాణా మరియు భద్రపరిచే ప్రక్రియలో కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు కల్పించినట్లు తెలిపారు .

మార్చి 14, 2026 నుండి ఏప్రిల్ 16, 2026 వరకు నిర్వహించనున్న పదో తరగతి ( ఎస్ ఎస్ సీ )పబ్లిక్ పరీక్షలకు అవసరమైన సదుపాయాల కల్పన కోసం చర్యలు చేపట్టినట్లు తెలిపారు. సాధారణ పరీక్షలు ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించబడనున్నాయని చెప్పారు. జిల్లాలో 12,731 మంది రెగ్యులర్ విద్యార్థులు, 404 మంది ప్రైవేట్ అభ్యర్థులు నమోదు కాగా, మొత్తం 73 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు.

పదో తరగతి పరీక్షల నిర్వహణలో ప్రశ్నాపత్రాల భద్రత, సీసీటీవీ పర్యవేక్షణ, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాల ఏర్పాటు, చీఫ్ సూపరింటెండెంట్లు, సంబంధిత శాఖల అధికారుల సమన్వయం, తాగునీరు మరియు ఇతర మౌలిక వసతుల కల్పన వంటి అంశాలపై సమగ్ర చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. విధుల్లో పాల్గొనే అధికారులు తప్పని సరిగా తమ ఐడీ కార్డులు ధరించి బాధ్యతాయుతం గా విధులు నిర్వర్తించే విధంగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు . సిబ్బందికి అవసరమైన శిక్షణ తరగతులు నిర్వహించినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో కి ఫోన్ లు మరే ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలకు తీసుకు వెళ్లకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ వివరించారు.

ఇంటర్, పదో తరగతి పబ్లిక్ పరీక్షలను సమన్వయం తో, విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ స్పష్టం చేశారు.

ఈ సమావేశం లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యచందన, జిల్లా విద్యాశాఖ అధికారి నాగలక్ష్మి, జిల్లా ఇంటర్మీడేట్ అధికారి వెంకటేశ్వర్లు ,వైద్య శాఖ అధికారి తుకారాం రాతోడ్,డి పి ఓ సుధీర్, కొత్తగూడెం కార్పొరేషన్ కమిషనర్ సుజాత,రవాణా శాఖ అధికారి,టేకులపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సులోచనరాణి ,ఆర్ అండ్ బి ఈ ఈ వెంకటేశ్వర్లు,సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## యువజన కాంగ్రెస్ పార్టీ వలిగొండ మండల అధ్యక్షులు మైసోళ్ళ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో సమావేశం.



**వలిగొండ మండలం పెన్ సత్తా, ఫిబ్రవరి 24:** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ పట్టణ కేంద్రంలో శివసాయి ఫంక్షన్ హాల్ లో వలిగొండ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మైసోళ్ళ ప్రవీణ్ కుమార్ అధ్యక్షతన వలిగొండ మండల యువజన కాంగ్రెస్ ఎగ్జిక్యూటివ్ మీటింగ్ నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జిల్లా యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంగ ప్రవీణ్, భువనగిరి అసెంబ్లీ అధ్యక్షులు వాసుదేవ్ రెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు బత్తిని వరుణ్, తదితరులు సమావేశానికి హాజరైనారు. అనంతరం యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు మైసోళ్ళ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా పాలన ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాల ద్వారా రాష్ట్ర ప్రజలకు లబ్ది చేకుతుందని అదేవిధంగా భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో భువనగిరి నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పథకాల ద్వారా భువనగిరి నియోజకవర్గం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందని అయిన అన్నారు. రానున్న రోజులలో వలిగొండ మండల పరిధిలోని ప్రతి గ్రామంలో యువజన కాంగ్రెస్ పార్టీ కమిటీలు ఏర్పాటు చేస్తామని అదేవిధంగా రానున్న రోజులలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసి ఎంపిటిసి, జడ్పీటీసీ ఎన్నికలలో అత్యధిక స్థానాలను కైవసం చేసుకోవడాని తమ వంతు బాధ్యతగా కృషి చేస్తామని అయన అన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రధాన కార్యదర్శులు శ్రీశైలం, దేవేందర్ అసెంబ్లీ యూత్ ఉపాధ్యక్షులు బాలు, ప్రధాన కార్యదర్శులు నవీన్, ఉదయ్, గణేష్ మండల యూత్ ఉపాధ్యక్షులు మహిపాల్, ప్రధాన కార్యదర్శి సాయి, మధు, శ్రీకాంత్, అరుణ్, వినయ్, బాలు, మురళి, వంశీ, విన్ను, బాలు, రవి, నవీన్, యువజన కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వరుణుడి దెబ్బకు సామాన్య రైతులకు కన్నీళ్లు.



**చింతకాని పెన్ సత్తా, ఫిబ్రవరి 24: ప్రతినిధి.**నాగులవంచ గ్రామం రైతులపై ప్రకృతి పగబట్టింది పంట వేసినప్పటి నుంచి సాగునీరు అందక.. తెగుళ్ల బారి నుంచి పంటను కాపాడుకుంటూ వస్తున్నా తీరా చేతికొచ్చే సమయంలో పరీక్ష పెడుతున్నది. ఈదురు గాలులతో కూడిన అకాల వర్షం మొక్కజొన్న పంటలను నేలపాలు చేసి అపార నష్టాన్ని మిగిల్చింది. సోమవారం రాత్రి నుంచి మంగళవారంతెల్లవారుజాము వరకు కురిసిన వర్షంతో మొక్కజొన్న, పంటలకు తక్షణమే అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి నష్టాన్ని అంచనా వేసి తక్షణమే పరిహారం అందించి, రైతులను ఆదుకోవాలి. వందలాది ఎకరాల్లో పంట నేలవాలడం, చేతికొచ్చిన మొక్కజొన్న పంట నేలకు వాలిపోవడంవల్ల రైతులు అప్పులు చేసిన వారిలో ఎక్కువగా కౌలు రైతులే నష్టపోయిన వారిలో ఉన్నారు ఈసారి పంటతో కౌలు కట్టుకుని కొంత మిగిలితే వాళ్ళ పిల్లల భవిష్యత్తుకు ఉపయోగపడితే బాగు అని ఆశపడ్డారు కానీ సాగు చేసిన పంటలు కళ్లముందే నాశనమవడంతో ఆవేదన వ్యక్తం చేశారు గ్రామానికి చెందిన కౌలు రైతులు
బైరు వెంకటేశ్వరరావు,
బైరు రామ స్వామి,అనగాని యలయ్య తండ్రి లచ్చయ్య, కందిమల్ల రవి, జంగిలి శ్రీను, పోలంపల్లి వెంకయ్య, అనగాని లచ్చయ్య తదితరులు కన్నీళ్ళతో వాపోతున్నారు.

# ఆర్ అండ్ బి అధికారులు స్పందించండి.



**చింతకాని పెన్ సత్తా, ఫిబ్రవరి 24: ప్రతినిధి.**జగన్నాధపురం –చింతకాని వెళ్లే రహదారిపై నడిరోడ్డుపై గుంట పడి వాహనదారులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. రాత్రి సమయంలో వాహనదారులకు రోడ్డుపై ఉన్నా గుంట తెలియక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని తక్షణమే ఆర్ అండ్ బి అధికారులు స్పందించి ఆ గుంటను పూడ్చి ప్రజలకు ప్రమాదాలు బారిన పడకుండా కాపాడాలని ఆర్ అండ్ బి అధికారులను కోరుతున్న వాహనదారులు.

# టిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం.



యూరియా యాప్ ను వెంటనే రద్దు చేయాలి.

**వలిగొండ మండలం పెన్ సత్తా, ఫిబ్రవరి 24:** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం కేంద్రంలోని టిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతులతో కలిసి యూరియా యాప్ ను రద్దుచేసి రైతులందరికీ యూరియా తక్షణమే అందజేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా కార్యక్రమం నిర్వహిస్తూ మీడియాతో నాయకులు మాట్లాడినారు.

ప్రభుత్వాలు ఉన్నవి రైతుల కష్టాలు చూసుకోవాలని యూరియా దొరకక యూరియా యాప్ ఏ విధంగా డౌన్లోడ్ చేసుకోవాలో అర్థం కాక తెల్వక ఇబ్బందులు పడుతున్నారని.

కౌలు రైతులు సన్నకారు రైతులు అనేక ఇబ్బందులకు గురి అవుతున్నారని రైతే రాజ్యం అని అధికారంలో వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసి పాలనా కొనసాగిస్తూ కాలయాపన చేస్తుందని రాష్ట్రంలో ఉన్న రైతుల పరిస్థితి చాలా దారుణంగా ఉన్నదని రైతుల ఉసురు కలిగి సర్వనాశనం అయ్యే పరిస్థితి కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతుందని తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వంలో కరోనా కష్టకాలంలో ఆగమాగం అవుతుంటే తెలంగాణ ప్రభుత్వానికి ఆదాయం లేకున్న రైతుబంధు ఆపలేదు. ఇది తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం నాయకులు గమనించాలని ఇకనైనా యూరియా యాప్ రద్దు చేయాలని దీని వలన రైతులు రైతు కుటుంబాలు నష్టపోవడం జరుగుతుందని యూరియా యాప్ రద్దుచేసి ప్రభుత్వము ఈ నిర్ణయము వెనక్కి తీసుకోవాలని ఇంత ముందుకు ఏ విధంగా ఉన్నాదో పాత పద్ధతిని పాటించాలని.

ధర్నా నిర్వహిస్తూ మీడియా ద్వారా రైతులు మండల నాయకులు డిమాండ్ చేస్తూ మాట్లాడినారు.

ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మొగుళ్ళ శ్రీనివాస్ మండల అధ్యక్షులు తుమ్మల వెంకట్ రెడ్డి పట్టణ అధ్యక్షులు అప్రోచ్ మండల నాయకులు కీసరి రాంరెడ్డి కాసుల కృష్ణ వరికుప్పల మల్లేశం మారయ్య రాజు పలుసం రమేష్ ఒంగల బిక్షపతి ముద్దసాని కిరణ్ బొడిగె లింగస్వామి గంధ మల్ల బ్రహ్మయ్య మద్దెల మంజుల చేగూరి గోపాల్ ప్రతి గ్రామము నుండి టిఆర్ఎస్ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని ధర్నాను విజయవంతం చేసినారు.

పోలీస్ సిబ్బంది ఎస్సై యుగంధర్ ఎమ్మార్వో దశరథ సార్ ధర్నా దగ్గరికి వచ్చి సార్ది చెప్పి పై అధికారులకు వివరణ ఇస్తామని ధర్నాను సడలింపు చేయించినారు.

## మాజీ ఎంపీపీ చిందం సబిత కుటుంబాన్ని పరామర్శించిన, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి



**చేగుంట పెన్ సత్తా, ఫిబ్రవరి 24:** నార్సింగి మండలం వల్లూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు, మాజీ ఎంపీపీ చిందం సబిత భర్త రవీందర్ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మరణించారు.
ఈ విషాద ఘటన పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన దుబ్బాక శాసనసభ్యులు కొత్త ప్రభాకర్ రెడ్డి మంగళవారం వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు, మాజీ ఎంపీపీ కుటుంబానికి అండగా ఉంటామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.కుటుంబ సభ్యులకు ఈ అపార నష్టాన్ని తట్టుకునే మనోధైర్యం ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు.
ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ఆదేశానుసారం వేమలకొండ పెద్ద చెరువు సర్వే పనులు పూర్తి.



**వలిగొండ మండలం పెన్ సత్తా, ఫిబ్రవరి 24:** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని.
వేమూమలకొండ పెద్ద చెరువు తూముల మరియు కట్ట సర్వే చేయడం జరిగింది మండల్ ఖవ లు జ్యోతర్మయి, శిల్ప మరియు వర్క్ ఇన్స్పెక్టర్ లు రమేష్, కుమార్. మరియు వేములకొండ రైతు పులిపలుపుల రాములు తదితరులు పాల్గొన్నారు మీడియాతో జిల్లా నాయకులు పులి పలుపుల రాములు గౌడ్ మాట్లాడుతూ రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతు కుటుంబాలు అన్ని విధాలుగా అభివృద్ధి చెంది ఉండాలని ప్రభుత్వం అన్ని సంక్షేమ పథకాలు నిరుపేదలకు ఏర్పాటు చేస్తుందని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆదేశానుసారం వేములకొండ పెద్ద చెరువును సర్వే చేయించి తూములు షటర్లు రిపేర్ చేసే విధంగా అధికారులు ఈరోజు వచ్చి చెరువును సర్వే చేసినారని రైతులు పండించే పంటకు సరైన నీరు అందించే దిశగా ఉండాలని రైతు బాంధవులు ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అని మీడియా ద్వారా పులిఫలుపుల రాములు గౌడ్ ఎస్కే రసూల్ మాట్లాడినారు.

## 12వ వార్డు సమస్యలు తెలుసుకుంటున్న కౌన్సిలర్

తోటకూర విజయలక్ష్మి వెంకటేష్ యాదవ్.








**వలిగొండ ప్రతినిధి పెన్ సత్తా, ఫిబ్రవరి 24:** యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో12వా వార్డ్ తాతనగర్ లో మున్సిపల్ సిబంది తో వార్డ్ లొ పర్యటించి సమస్యలు తెల్సుకుంటున్న కౌన్సిలర్ తోటకూర విజయలక్ష్మి వెంకటేష్ గారు మాట్లాడుతు వార్డ్. లొ ఎలాంటి సమస్య. ఒచ్చిన వెంటనే. పరిష్కరించాలని సిబందిని కోరడం జరిగిందిలి

# ఆర్థిక సహాయం అందజేత.



**వలిగొండ మండలం పెన్ సత్తా, ఫిబ్రవరి 24:** వలిగొండ మండలం మొగిలిపాక గ్రామానికి చెందిన షేక్ ఖాసీం ఇటీవల చిట్యాల నుండి గ్రామానికి వస్తున్న సమయంలో మార్గ మధ్యలో ప్రమాదానికి గురై వలిగొండ రేణుక హాస్పిటల్లో చికిత్స పొందుతున్నాడు అని తెలుసుకొని పరామర్శించి 5000 రూపాయల ఆర్థిక సహాయం చేసిన మొగిలిపాక అభివృద్ధి ప్రదాత శ్రీ మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన మాజీ చైర్మన్ ముద్దసాని కిరణ్ రెడ్డి గారు ఈ కార్యక్రమంలో గ్రామా సర్పంచ్ జడిగే బుచ్చయ్య యాదవ్,ఉప సర్పంచ్ షేక్ సైదులు, బిఅర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బీమనబోయిన బిక్షపతి, వార్డు సభ్యులు పబ్బు వెంకటేష్,పబ్బు శిరీష బాలకృష్ణ,మచ్చ సునీత స్వామి,మాజీ సర్పంచ్ జక్కుల శంకరయ్య,మాజీ ఉప సర్పంచ్ విష్ణు చారి,మాజీ పాల సంఘం చైర్మన్ జక్క ఇంద్ర రెడ్డి మరియు బిఅర్ఎస్ పార్టీ నాయకులు,మచ్చ నవీన్,జక్క శ్రీనివాస్ రెడ్డి,షేక్ ఫకీర్, మచ్చ ముత్యాలు,బీమనబోయిన మచ్చేందర్, మొగిలిపాక దుర్గయ్య, షేక్ ఖాసీం, మొగిలిపాక శామంత్,షేక్ అజిత్ పాల్గొన్నారు

# వినియోగదారులకు ఊరట.. భారీగా పడిపోయిన వెండి ధరలు




హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో ధరలు ఊహించని విధంగా పతనమయ్యాయి. ఒక్క రోజులోనే వెండి కేజీపై ఏకంగా రూ.15,000 తగ్గింది.ఇక బంగారం ధరలు మాత్రం స్వల్ప పెరుగుదలను నమోదు చేశాయి. 24 క్యారెట్ల స్వచ్ఛమైన 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.430 పెరిగి రూ.1,61,780కి చేరింది. ఇక ఆభరణాలలో వినియోగించే 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం రూ.400 మేర పెరిగి రూ.1,48,300 వద్ద కొనసాగుతోంది. గత కొన్ని రోజులుగా ఆకాశమే హద్దుగా పెరుగుతూ వచ్చిన వెండి ధర ఇవాళ భారీగా దిగివచ్చింది. నిన్నటి ధరతో పోలిస్తే ఇప్పుడు కేజీ వెండి రూ.2,85,000 వద్ద పలుకుతోంది. వెండి ఆభరణాలు కొనేవారికి, పెట్టుబడిదారులకు ఇది పెద్ద ఊరట అని చెప్పవచ్చు. అంతర్జాతీయ మార్కెట్‌లో చోటుచేసుకుంటున్న పరిణామాల ప్రభావం దేశీయ బులియన్ మార్కెట్‌పై స్పష్టంగా కనిపిస్తోంది. పసిడి ప్రియులు కొనుగోలు చేసే ముందు తాజా ధరలను ఒకసారి సరిచూసుకోవడం మంచిదని బిజినెస్ ఎక్స్‌పర్ట్స్ సూచిస్తున్నారు.

# లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

భారతీయ ఈక్విటీ మార్కెట్లు సోమవారం లాభాలను సాధించాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారీ టారిఫ్‌లను అమెరికా సుప్రీంకోర్టు కొట్టివేయడంతో అంతర్జాతీయ మార్కెట్లతో పాటు, మన ఇన్వెస్టర్ల సెంటిమెంట్ పుంజుకుంది.దీనికితోడు ఫైనాన్స్, పీఎస్‌యూ బ్యాంక్, ఫైనాన్షియల్ స్టాక్స్‌లో కొనుగోళ్ల కారణంగా మార్కెట్లలో ర్యాలీ జరిగింది. గ్లోబల్ మార్కెట్లపై బలహీన యూఎస్ డాలర్, 10 ఏళ్ల ట్రెజరీ బాండ్ల ఒత్తిడి ఉన్నప్పటికీ మదుపర్లు పూర్తిగా దేశీయ పరిణామాల ఆధారంగా క్రయవిక్రయాలు జరిపారు. విదేశీ ఇన్వెస్టర్లు రూ. 934 కోట్ల విలువైన నిధులను వెనక్కి తీసుకెళ్లినప్పటికీ, దేశీయ సంస్థాగత పెట్టుబడిదారులు రూ. 2,600 కోట్ల కంటే ఎక్కువ విలువైన షేర్లను కొనుగోలు చేయడంతో ర్యాలీ కొనసాగింది. మన స్టాక్ మార్కెట్లతో పాటు ఆసియా ప్రాంతంలో హాంకాంగ్ హాంగ్ సెంగ్ 2.53 శాతం, దక్షిణ కొరియాకు చెందిన కోస్పి 1 శాతం పెరిగాయి. దీంతో మార్కెట్లు ముగిసే సమయానికి సెన్సెక్స్ 479.95 పాయింట్లు లాభపడి 83,294కి, నిఫ్టీ 141.75 పాయింట్లు పెరిగి 25,713 వద్ద ముగిశాయి. అమెరికా డాలరుతో రూపాయి మారకం విలువ రూ. 90.94 వద్ద ఉంది. ఆదివారం ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకుకు చెందిన చండీగఢ్‌లోని ఓ బ్రాంచులో రూ. 590 కోట్ల భారీ మోసం వెలుగులోకి వచ్చిన సంగతి తెలిసిందే. ఈ ప్రభావం సోమవారం బ్యాంకు షేర్లు ఏకంగా 16 శాతం పతనమై రూ. 70.09 వద్ద స్థిరపడింది.

# ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ వ్యవహారంపై స్పందించిన ఆర్‌బీఐ




ప్రముఖ ప్రైవేటు రంగ ఐడీఎఫ్‌సీ బ్యాంకులో జరిగిన రూ. 590 కోట్ల భారీ మోసంపై భారతీయ రిజర్వ్ బ్యాంక్(ఆర్‌బీఐ) గవర్నర్ సంజయ్ మల్హోత్రా స్పందించారు. యూనియన్ బడ్జెట్ తర్వాత సాంప్రదాయంగా ఆర్థిక మంత్రితో జరిగే సమావేశం అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకులో జరిగిన ఫ్రాడ్ వ్యవహారంపై, దాని చుట్టూ నెలకొన్న పరిణామాలను గమనిస్తున్నామని, ఇందులో ఎలాంటి వ్యవస్థాగత మోసం జరగలేదని మల్హోత్రా చెప్పారు. హర్యానా ప్రభుత్వానికి చెందిన ఖాతాల్లో బ్యాంకు ఉద్యోగులు, ఇతరులు చేసిన రూ.590 కోట్ల మోసాన్ని ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ ఆదివారం బహిర్గతం చేసిన సంగతి తెలిసిందే. దీనిపై స్పందించిన బ్యాంక్ ఎండీ, సీఈఓ వి.వైద్యనాథన్, బ్యాంకులోని లోపాలను సరిదిద్దడంతో పాటు బాధ్యులపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సీనియర్ మేనేజ్‌మెంట్ స్థాయిలో ఎవరికీ ఈ మోసంలో ప్రమేయం లేదని, సాధారణ బ్యాంకింగ్ లావాదేవీలు యథావిధిగా కొనసాగుతాయని తెలిపారు. హర్యానా ప్రభుత్వం ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకు నుంచి మరో బ్యాంకుకు తమ ఖాతాను బదిలీ చేయాలని కోరిన సమయంలో ఈ వ్యవహారం బయటకు వచ్చింది. ప్రభుత్వ రికార్డుల్లో ఉన్న దానికి, బ్యాంక్ స్టేట్‌మెంట్‌లో ఉన్న బ్యాలెన్స్‌కు మధ్య వ్యత్యాసం ద్వారా ఈ ఫ్రాడ్‌ను గుర్తించారు. చండీగఢ్‌లోని బ్రాంచ్‌లో కొందరు ఉద్యోగులు బయటి వ్యక్తులతో కలిసి ఈ మోసం చేసినట్టు తెలుస్తోంది.

# ఆసియాలో 2వ అతిపెద్ద కార్యాలయాన్ని ప్రారంభించిన అమెజాన్





ప్రముఖ ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్ ఇండియా భారత్‌లో మరో అతిపెద్ద కార్యాలయాన్ని ప్రారంభించింది. సోమవారం కంపెనీ బెంగళూరులో ఆసియాలోనే రెండో అతిపెద్ద ఆఫీసును అందుబాటులోకి తీసుకొచ్చింది.ఇప్పటికే కంపెనీకి హైదరాబాద్‌లోని నానక్‌రామ్‌గూడలో అతిపెద్ద కార్యాలయం ఉంది. కొత్తగా ప్రారంభించిన ఆఫీసు 11 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉందని, దేశీయంగా ఈ-కామర్స్, కార్యకలాపాలు, చెల్లింపులు, టెక్నాలజీ, సెల్లర్ సహా అన్ని విభాగాల్లో 7,000 మందికి పైగా ఉద్యోగులు పనిచేసేలా ఇది ఉంటుంది. ఈ భవనం 12 అంతస్తులతో కూడిన క్యాంపస్ అని కంపెనీ స్పష్టం చేసింది. ఈ కార్పొరేట్ ఆఫీస్ ఉద్యోగులందరూ ఒకే చోట మెరుగైన సహకారంతో పనిచేస్తారు. ఈ కొత్త క్యాంపస్ అమెజాన్ భారత పెట్టుబడుల్లో భాగమని అమెజాన్ స్పష్టం చేసింది. అమెజాన్ ఇప్పటికే దేశంలో రూ. 3.63 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టింది. 2030 నాటికి దేశంలో అదనంగా మరో రూ. 3 లక్షల కోట్ల వరకు పెట్టుబడికి కట్టుబడి ఉన్నట్టు కంపెనీ వెల్లడించింది. కొత్త ఆఫీస్ ప్రారంభం సందర్భంగా అమెజాన్ ఇండియా కంట్రీ మేనేజర్ సమీర్ కుమార్ మాట్లాడుతూ, అమెజాన్‌కు భారత్ దీర్ఘకాలిక ప్రాధాన్యత కలిగిన దేశంగా ఉందని పేర్కొన్నారు.

# ఈపీఎఫ్ఓ శుభవార్త.. 31 లక్షల మందికి బెనిఫిట్




ప్రైవేట్ రంగంలో ఉద్యోగుల ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన గొప్ప సామాజిక భద్రతా పథకం ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్. దీనిని ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ నిర్వహిస్తోంది. కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఇది పని చేస్తుంది. ఇప్పుడు ఈపీఎఫ్ఓ కు సంబంధించి.. లేబర్ మినిస్ట్రీ ఒక కీలక ప్రకటన చేసింది. ఇది ఒక రకంగా శుభవార్త. ఈపీఎఫ్ఓ ఇన్‌ఆపరేటివ్ అకౌంట్లకు సంబంధించి అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లను వారి వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేయాలని నిర్ణయం తీసుకుంది. క్లెయిమ్ చేయని వారి పీఎఫ్ ఖాతాల్లో పెద్ద మొత్తంలో నిధులు పోగుబడగా.. వీటిని చందాదారుల ఖాతాల్లోకే బదిలీ చేయాలని నిర్ణయించడం విశేషం. ఈ కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో సుమారు 31 లక్షల మంది వరకు చందాదారులకు ప్రయోజనం దక్కనుంది. అయితే పైలట్ ప్రాజెక్టుగా చేపట్టే తొలి విడతలో సుమారు 7 లక్షల మంది వరకు ఈ ప్రయోజనాలు పొందుతారని కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ చెప్పుకొచ్చారు. త్వరలోనే ఇది ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈపీఎఫ్ఓ వీక్లీ రివ్యూ మీటింగ్‌లో ఈ నిర్ణయం తీసుకున్నట్లు మాండవీయ సోమవారం వివరించారు. ప్రస్తుతానికి 31.86 లక్షల వరకు పీఎఫ్ ఖాతాలు.. నిర్వహణ లేవని (ఇనాపరేటివ్) ఈపీఎఫ్ఓ గుర్తించింది. దీంట్లో సుమారు రూ. 10,903 కోట్ల మేర నిల్వలు ఉన్నట్లు అంచనా వేస్తోంది. వీటిల్లో సుమారు 7.11 లక్షల ఖాతాల్లో రూ. 1000 వరకు మాత్రమే నగదు నిల్వలు ఉన్నట్లు పేర్కొంది. వీటి విలువ మొత్తంగా రూ. 30.52 కోట్లుగా ఉన్నాయి. లేబర్ మినిస్ట్రీ ప్రకారం.. ఈ నిర్వహణలో లేని పీఎఫ్ ఖాతాల్లో 20 ఏళ్లకు పైబడినవి కూడా ఉన్నాయి. దాదాపు మూడేళ్లుగా ఎలాంటి ట్రాన్సాక్షన్ నిర్వహించిన పీఎఫ్ అకౌంట్లను ఇన్‌ఆపరేటివ్ అకౌంట్లుగా పేర్కొంటారు. ముందుగా ఇప్పుడు పైలట్ ప్రాతిపదికన ముందుగా 7 లక్షల ఖాతాల్లోని అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లను వారి బ్యాంక్ అకౌంట్లలో జమ చేయనుంది ఈపీఎఫ్ఓ. ఇక్కడ ఆధార్‌తో అనుసంధానం అయి ఉన్న బ్యాంక్ అకౌంట్, ఈపీఎఫ్ఓ దగ్గర ఉన్నటువంటి వివరాల ఆధారంగా ఈ నగదు జమ చేయనుంది. ఇక్కడ చందాదారులు..
ఎలాంటి క్లెయిమ్ సెటిల్మెంట్ డాక్యుమెంట్స్ గానీ లేదా ఇతర డాక్యుమెంట్స్ గానీ ఇవ్వాల్సిన అవసరం లేదు. పైలట్ ప్రాజెక్ట్ విజయవంతం అయితే.. అప్పుడు మిగతా 25 లక్షల మంది వరకు నిర్వహణలో లేని పీఎఫ్ చందాదారుల ఖాతాల్లోకి కూడా డబ్బును ఆటోమేటిక్‌గా రిఫండ్ చేసేందుకు ఈపీఎఫ్ఓ సన్నాహాలు చేస్తోంది.

# రూ.3 లక్షల కోట్ల ఎగుమతులకు సుంకం వర్తించదా?



ప్రతీకార సుంకాలను రద్దు చేస్తూ అమెరికా సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసినా, వెనక్కి తగ్గని ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రపంచ దేశాల ఉత్పత్తులపై 15% సుంకం విధిస్తున్నానని, భారత్‌కూ ఇదే వర్తిస్తుందని తెలిపారు. వాణిజ్య చట్టం- 1974లోని సెక్షన్ 122 కింద ప్రతిపాదించిన టారిఫ్ చర్యల ప్రకారం.. 150 రోజుల వరకు 15% దాకా సుంకాలను అమెరికా అధ్యక్షుడు విధించొచ్చు. అయితే సుమారు 34 బి.డాలర్ల (సుమారు రూ.3 లక్షల కోట్ల)కు పైగా విలువైన భారత ఎగుమతులకు ఈ సుంకం నుంచి మినహాయింపు ఉంటుందని ఆంగ్ల పత్రికలు అంచనా వేశాయి. సుంకాల నుంచి మినహాయింపు ఉండే వాటిల్లో ఔషధాలు, ఎలక్ట్రానిక్స్‌తో పాటు పౌర విమానయాన రంగానికి సంబంధించినవి ఉండొచ్చని సమాచారం. ఇంతకుముందు జపాన్, ఐరోపా కూటమి, యునైటెడ్ కింగ్‌డమ్‌కు కూడా ఈ తరహా మినహాయింపులను అమెరికా పొడిగించింది. 2024లో అమెరికాకు మనదేశ మొత్తం ఎగుమతులు 87.7 బిలియన్ డాలర్లు (సుమారు రూ.8 లక్షల కోట్లు)గా ఉన్నాయి. తాజా అమెరికా సుంకాల నుంచి మినహాయింపు ఉండే భారత ఎగుమతుల్లో.. ఔషధ రంగం ముందు వరసలో ఉండనుంది. ఈ రంగానికి సంబంధించి 10.6 బిలియన్ డాలర్ల (రూ.95,400 కోట్ల) విలువైన ఎగుమతులకు సుంకం వర్తించకపోవచ్చు. యాంటీబయోటిక్ ఫార్ములేషన్లు, హార్మోన్ల ఆధారిత ఔషధాలు, ఇమ్యునోలాజికల్ ఉత్పత్తుల వంటివి ఇందులో ఉంటాయి.

# బ్యాంకులు మిస్-సెల్లింగ్‌కు దూరంగా ఉండాలి




వినియోగదారులకు బీమా వంటి ఆర్థిక ఉత్పత్తులను తప్పుడు వివరాలతో బ్యాంకుల్లోనే విక్రయించడం (మిస్-సెల్లింగ్)పై ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ‘బ్యాంకులు తమ ప్రధాన వ్యాపారంపై దృష్టి పెట్టాలి. అవసరం లేకపోయినా బీమా ఉత్పత్తులు విక్రయించడానికే బ్యాంకులు ఎక్కువ సమయం కేటాయిస్తున్నాయి. బ్యాంకుల నియంత్రణ సంస్థ ఆర్‌బీఐ, బీమా నియంత్రణ సంస్థ ఐఆర్‌డీఏఐ మధ్య ఉన్న నిర్వహణ పరమైన దూరం వల్ల ఎవరికీ జవాబుదారీతనం లేకుండా పోయింది’ అని పేర్కొన్నారు. బడ్జెట్ తర్వాత నిర్వహించిన రిజర్వ్‌బ్యాంక్ (ఆర్‌బీఐ) సెంట్రల్ బోర్డ్ సమావేశం అనంతరం ఆర్థిక మంత్రి విలేకరులతో మాట్లాడారు. మిస్-సెల్లింగ్‌ను ఉపేక్షించేది లేదంటూ ఆర్‌బీఐ ఇచ్చిన ముసాయిదా మార్గదర్శకాలపై సంతోషంగా ఉందన్నారు. ‘ఇకపై ఇలాంటి పనులు చేయలేరు అనే సందేశం బ్యాంకులకు వెళ్లాలి’ అని మంత్రి పేర్కొన్నారు. బ్యాంకులు డిపాజిట్లు, రుణాలపైనే దృష్టి సారించాలని ఆమె సూచించారు. గృహరుణం తీసుకునేందుకు ఇల్లు/స్థలం తాకట్టు పెడుతుండగా, మళ్లీ బీమా తీసుకోమని బ్యాంకులు ఒత్తిడి చేస్తుండటాన్ని మంత్రి ప్రశ్నించారు.

# ట్రంప్ నివాసంలోకి సాయుధ దుండగుడి చొరబాటు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నివాసంలోకి ఓ సాయుధ వ్యక్తి చొరబడటం అగ్రరాజ్యంలో తీవ్ర సంచలనం సృష్టించింది. ఫ్లోరిడాలోని పామ్ బీచ్‌లో ఉన్న ట్రంప్ వ్యక్తిగత రిసార్టు ‘మార్-ఎ-లాగో’ వేదికగా ఆదివారం తెల్లవారుజామున ఈ హైడ్రామా చోటుచేసుకుంది. అధికారిక వివరాల ప్రకారం.. ఆదివారం తెల్లవారుజామున సుమారు 1.30 గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. మార్-ఎ-లాగో ఉత్తర గేటు గుండా ఒక వాహనం బయటకు వెళ్తున్న సమయాన్ని ఆసరాగా చేసుకున్న దుండగుడు.. తన వాహనంతో అత్యంత వేగంగా లోపలికి దూసుకొచ్చాడు. అప్పటికే అక్కడ కాపలా ఉన్న ఇద్దరు సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు, ఒక పోలీసు అధికారి వెంటనే అతడిని చుట్టుముట్టారు. అయినా అతడు లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించగా.. నిందితుడి వాహనాన్ని పరిశీలించారు. ఈక్రమంలోనే అందులో ఒక మారణాయుధం, గ్యాస్ క్యాన్ ఉన్నట్లు భద్రతా సిబ్బంది గమనించారు. అప్పటికే నిందితుడు ఆయుధాలను పట్టుకుని కాల్పులు జరపబోయాడు. అయితే భద్రతా సిబ్బంది వాటిని కింద పడేయాలని పదే పదే సూచించింది. అయినా అతడు మొండిగా వ్యవహరించాడు. ముఖ్యంగా భద్రతా బలగాల హెచ్చరికలతో నిందితుడు గ్యాస్ క్యాన్‌ను పక్కన పెట్టినప్పటికీ.. షాట్‌గన్‌ను మాత్రం వదల్లేదు. ఎదురుగా ఉన్న అధికారులపై కాల్పులు జరిపేందుకు వీలుగా తుపాకీని ఎత్తి పట్టుకున్నాడు. దీంతో ఆత్మరక్షణ కోసం, అధ్యక్షుడి నివాస రక్షణ దృష్ట్యా సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు తక్షణమే స్పందించి నిందితుడిపై కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో మార్టిన్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ఇదిలా ఉండగా మృతి చెందిన వ్యక్తిని ఉత్తర కరోలినాకు చెందిన 21 ఏళ్ల ఆస్టిన్ టకర్ మార్టిన్‌గా అధికారులు గుర్తించారు.

# నేపాల్‌లో నదిలోకి దూసుకెళ్లిన బస్సు



పొరుగు దేశం నేపాల్‌లో సోమవారం తెల్లవారుజామున ఒక భీకర రోడ్డు ప్రమాదం సంభవించింది. ప్రయాణీకులతో వెళ్తున్న ఒక బస్సు అదుపుతప్పి లోతైన త్రిశూలి నదిలోకి దూసుకెళ్లింది.ధాడింగ్ జిల్లాలో జరిగిన ఈ విషాద ఘటనలో కనీసం 18 మంది ప్రాణాలు కోల్పోగా..సుమారు 28 మంది తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద తీవ్రతను బట్టి చూస్తుంటే.. మృతుల సంఖ్య మరింతగా పెరిగే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోఖారా నుంచి రాజధాని కాఠ్మాండూకు వెళ్తున్న ఈ ప్రయాణీకుల బస్సు సోమవారం తెల్లవారుజామున 1.15 నుంచి 1.30 గంటల మధ్య ప్రమాదానికి గురైంది. పృథ్వీ హైవేపై కాఠ్మాండూకు 90 కిలో మీటర్ల దూరంలో ఉన్న బెనిఘాట్ రోరాంగ్ రూరల్ మునిసిపాలిటీ పరిధిలోని చీనాధార వద్ద బస్సు అదుపుతప్పి నదిలోకి పడిపోయింది. ప్రమాద సమయంలో బస్సులో 45 మందికి పైగా ప్రయాణీకులు ఉన్నట్లు సమాచారం. చీకటి సమయంలో ప్రమాదం జరగడంతో సహాయక చర్యలు చేపట్టడం భద్రతా దళాలకు కష్టతరంగా మారింది. నేపాల్ ఆర్మీ, ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్, నేపాల్ పోలీసులు,స్థానిక ప్రజలు కలిసి వెంటనే రెస్క్యూ ఆపరేషన్ ప్రారంభించారు. ఇప్పటి వరకు 18 మృతదేహాలను వెలికితీశారు. మృతుల్లో న్యూజిలాండ్‌కు చెందిన ఒక పురుషుడు కూడా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. మొత్తం 28 మందిని నదిలో నుంచి ప్రాణాలతో బయటకు తీశారు. వీరిలో జపాన్, డచ్ దేశాలకు చెందిన ఇద్దరు మహిళలు కూడా ఉన్నారు. గాయపడిన వారందరినీ చికిత్స నిమిత్తం సమీపంలోని వివిధ ఆసుపత్రులకు తరలించారు.

పెన్ సత్తా
PEN SATTA Telugu Daily

# ఎడిటోరియల్

## అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి భరోసా ఏది?

ఏ రాష్ట్రమైన, ఏ దేశమైన అభివృద్ధి చెందాలంటే అత్యున్నత విలువ లతో కూడిన ప్రాంతంగా విలసిల్లాలంటే, ఆ ప్రాంతంలోని ఉన్నత విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలి. ఇది చారిత్రక సత్యం, అయితే మన రాష్ట్రంలోని ఉన్నత విద్యను పరిశీలించినట్లయితే తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ఉన్నత విద్య రంగంలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. కొత్త యూనివర్సిటీలు, కొత్త కోర్సులు, న్యాక్ ర్యాంకింగ్స్, డిజిటలైజేషన్, పరిశోధనలపై దృష్టి.. ఇలా ప్రభుత్వాలు తరచూ ఉన్నత విద్య అభివృద్ధి గురించి మాట్లాడుతున్నాయి. ఆ మాటలు ఆచరణలో సాధ్యం కావడానికి విద్యాభివృద్ధిలో నిత్యం వెనుక నుండి పనిచేస్తూ వ్యవస్థను నడిపించే నాన్ టీచింగ్ సిబ్బంది పరిస్థితి మాత్రం అగమ్య గోచరంగా తయారయ్యింది. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో మొత్తం 18 యూనివర్సిటీల్లో, ఉస్మానియా యూనివర్సిటీ, కాకతీయ యూనివర్సిటీ, అంబేద్కర్, శాతవాహన, మహాత్మాగాంధీ యూనివర్సిటీ, పాలమూరు, తెలుగు యూనివర్సిటీ, చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీ, ఆచార్య ఎన్.జి. రంగా యూనివర్సిటీ, కాళోజి అగ్రికల్చరల్ యూనివర్సిటీ మొదలగు వాటిల్లో సుమారు 5 నుండి 6వేల మంది పై చిలుకు బోధనేతర సిబ్బంది నాన్‌టీచింగ్(అవుట్‌సోర్సింగ్) ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరిలో చాలా మంది కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, డైలీ వేజ్ విధానంలో పనిచేస్తున్నారు. యూనివర్సిటీ పరిపాలన, పరీక్షల నిర్వహణ, విద్యార్థుల సర్టిఫికెట్లు, లైబ్రరీలు, ల్యాబ్‌లు, అకౌంట్స్, అడ్మినిస్ట్రేషన్ వంటి కీలక విభాగాలన్నింటినీ నడిపిస్తున్నవారు వీరే. అయినా సరే, వీరి జీవన భద్రతపై ప్రభుత్వానికి ఎందుకు శ్రద్ధ లేదు?గత ఏడేళ్లుగా వీరి వేతనాల్లో ఎలాంటి గణనీయమైన సవరణ లేదు. చాలాచోట్ల సకాలంలో జీతాలు కూడా అందడం లేదు. ఒకవైపు ధరలు పెరుగుతుంటే, మరోవైపు స్థిర ఆదాయం లేక కుటుంబ బాధ్యతలు ఎలా నిర్వహించాలన్నది అవుట్ సోర్సింగ్ సిబ్బందికి పెద్ద సమస్యగా మారింది. యూనివర్సిటీల్లో రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా పని చేస్తున్నా, వారికి లభించే ప్రయో జనాలు మాత్రం నాన్‌టీచింగ్ సిబ్బందికి దక్కడం లేదు. 'సమాన పనికి సమాన వేతనం' అన్న సూత్రం వీరి విషయంలో ఎందుకు అమలు కావడం లేదు?

ప్రభుత్వం తరచూ విద్యా వ్యవస్థలో నాణ్యత పెంచాలంటూ ప్రక టనలు చేస్తోంది. న్యాక్ ర్యాంకులు మెరుగుపడాలంటే అకడమిక్ స్టాఫ్‌తో పాటు పరిపాలనా వ్యవస్థ కూడా బలంగా ఉండాలి. కానీ ఆ వ్యవస్థను నడిపించే సిబ్బందే అసంతృప్తితో ఉంటే, నాణ్యత ఎలా పెరుగుతుంది? ఉద్యోగ భద్రత లేని సిబ్బందితో సమర్థవంతమైన పరిపాలన సాధ్యమా ఉన్నత విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తెస్తున్నామని చెప్పుకునే గొప్పలు ఎండమావులు కాక ఏమవుతావుతాయి? నాన్‌టీచింగ్ సిబ్బంది డిమాండ్లు కొత్తవేమీ కాదు. రెగ్యులరైజేషన్, వేతన సవరణ, సామాజిక భద్రత, ప్రమోషన్లు వంటి అంశాలు ఎన్నో ఎండ్లుగా పెండింగ్‌లోనే ఉన్నాయి. ప్రభుత్వం మారినా, హామీలు ఇచ్చినా, ఫైళ్లు కదలడం లేదు. ఇది పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమా? లేక ఉద్దేశపూర్వకంగా పక్కన పెట్టడమా? ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొవాల్సిన సమయం ఆసన్నమైంది. యూనివర్సిటీల్లో పనిచేస్తున్న నాన్‌టీచింగ్ సిబ్బందికి న్యాయం చేయకుండా ఉన్నత విద్య అభివృద్ధి గురించి మాట్లాడటం నిష్ప్రయోజనం. కేవలం మాటలకే పరిమితం కాకుండా, వాస్తవిక పరిస్థితులు అర్థం చేసుకొని ప్రభుత్వం, బోధనేతర సిబ్బంది పడుతున్న ఇబ్బందికర పరిస్థితులను గుర్తించి.. వారి సమస్యలు పరిష్కరించే దిశగా అడుగులు వేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో వివిధ యూనివర్సిటీలలో ఉన్న అన్నిరకాల బోధనేతర సిబ్బందికి అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు అండగా నిలబడాలని ఆశపడుతున్నారు..

# పెంపుడు పిల్లుల నుంచి పాఠాలు నేర్చుకున్నా..!


ఆమె వెండితెరపై నటిస్తుంటే ప్రేక్షకులు మంత్రముగ్ధులవుతారు. కెరీర్ పరంగా ఎన్నో శిఖరాలను అందుకున్న ఈ ముద్దుగుమ్మ, వ్యక్తిగత జీవితంలో మాత్రం చాలా సాదాసీదాగా ఉండటానికే ఇష్టపడుతుంది. తన ఇంట్లో ఉండే పెంపుడు పిల్లులే తనకు గురువులని, అవి నేర్పిన పాఠాలే తనను ఈరోజు ప్రశాంతంగా ఉంచుతున్నాయని ఆమె చెబుతోంది. తాజాగా ఒక ఇంటర్వ్యూలో తన చిన్ననాటి వెర్షన్‌కు రాసిన ఒక ప్రేమలేఖ ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారింది. స్కూల్ రోజుల్లో ఒక అబ్బాయి కోసం తాను చేసిన పనిని గుర్తు చేసుకుంటూ, తన భర్త గురించి ముందే ఊహించిన ఆ హీరోయిన్ మరెవరో కాదు.. బాలీవుడ్ బ్యూటీ అలియా భట్. ఆమె పంచుకున్న ఆ ఎమోషనల్ అండ్ ఫన్నీ విషయాలు ఏంటో తెలుసుకుందాం.. పిల్లులే నా గురువులు.. అలియా భట్‌కు జంతువులంటే ఎంత ప్రేమో అందరికీ తెలిసిందే. తన ఇంట్లో ఉండే ఎడ్వర్డ్, జునిపెర్ అనే పిల్లులతో ఆమె తరచుగా సమయాన్ని గడుపుతూ ఉంటుంది. తాజాగా ఎస్క్వైర్ ఇండియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తన పిల్లుల నుంచి నేర్చుకున్న పాఠాలను వివరించింది. "మిమ్మల్ని మీరు మరీ సీరియస్‌గా తీసుకోవద్దు. ఎవరి నుంచి ఎలాంటి అంచనాలు పెట్టుకోకండి. మీరు ఎంత తక్కువగా ఆశిస్తే, జీవితంలో అంత తక్కువ నిరాశ చెందుతారు. ప్రశాంతంగా నిద్రపోండి.. అప్పుడే జీవితం బాగుంటుంది" అని అలియా చెప్పుకొచ్చింది. జంతువుల నుంచి నేర్చుకున్న ఈ సరళమైన సూత్రాలే తన సక్సెస్‌కు కారణమని ఆమె నమ్ముతోంది.



అలియాకు ప్రేమలేఖ.. ఈ ఇంటర్వ్యూలో అలియా తన చిన్ననాటి వెర్షన్‌ను ఉద్దేశించి రాసిన ఒక లేఖ అందరినీ ఆకట్టుకుంది. అందులో తన చిన్నప్పటి కలలను వదులుకోవద్దని కోరింది. "చిన్నారి అలియా.. నువ్వు ఎప్పుడూ కలలు కంటూనే ఉంటావని నాకు తెలుసు. దయచేసి కలలు కనడం ఆపకు. నీలో ఉన్న ఆ కలలే నీ అతిపెద్ద శక్తి" అని పేర్కొంది. ఈ మాటలు ఆమె ఎంతటి పట్టుదలతో తన కెరీర్‌ను నిర్మించుకుందో తెలియజేస్తున్నాయి. తన టీనేజ్ రోజుల్లో జరిగిన ఒక చేదు జ్ఞాపకాన్ని అలియా సరదాగా గుర్తు చేసుకుంది. "హైస్కూల్‌లో ఆ మూర్ఖపు అబ్బాయి కోసం ఏడవద్దు. వాడు నీ కన్నీళ్లకు అస్సలు అర్హుడు కాదు. ఒక్క విషయం మాత్రం ప్రామిస్ చేస్తున్నాను.. ఒకరోజు నువ్వు ఈ ప్రపంచంలోనే అత్యుత్తమ అబ్బాయిని కలుస్తావు. అతను మరెవరో కాదు, నువ్వు రహస్యంగా ఇష్టపడే క్రష్ (రణబీర్ కపూర్)" అంటూ తన భర్త గురించి ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేసింది. రణబీర్ పట్ల తనకున్న ప్రేమన అలియా ఈ విధంగా వ్యక్తం చేసింది. మాతృత్వం గురించి మాట్లాడుతూ అలియా ఎంతో ఎమోషనల్ అయ్యింది. తనకు అత్యంత అందమైన కూతురు పుడుతుందని, తన హృదయం ఊహించని విధంగా ప్రేమతో నిండిపోతుందని ఆమె ఆ లేఖలో రాసుకుంది. తన కూతురు రహా గురించి ఒక ప్లేఫుల్ నోట్ లో ఇలా చెప్పింది.. "ఆమె ఒక చిన్న లాయర్ లాగా వ్యవహరించబోతోంది, కాబట్టి నువ్వు ఇప్పుడే సిద్ధంగా ఉండు" అంటూ నవ్వుతూ ముగించింది. కూతురు తెలివితేటలను అలియా ఈ విధంగా ప్రశంసించింది. అలియా భట్ మాటలు వింటుంటే ఆమె ఎంతటి పరిణతి చెందిన వ్యక్తిగా మారిందో అర్థమవుతుంది. పెంపుడు జంతువుల నుంచి నేర్చుకున్న పాఠాలైనా, చిన్నప్పటి చేదు జ్ఞాపకాలను నెమరువేసుకోవడమైనా.. ఆమె నిజాయితీకి అందరూ ఫిదా అవుతున్నారు. మనిషిగా ఎదగాలంటే గతంలోని తప్పులను నవ్వుతూ అంగీకరించాలని అలియా నిరూపించింది.

# నిద్ర పోకపోతే ఏమవుతుంది..? ఈ వ్యాధులు రావడం పక్కా..

ఉరుకుల పరుగుల జీవితంలో మనకు తెలియకుండానే అత్యంత విలువైన నిద్రను కోల్పోతున్నాం. అరచేతిలో మొబైల్, మెదడు నిండా పని ఒత్తిడి.. వెరసి రాత్రిపూట కంటికి కునుకు లేకుండా చేస్తున్నాయి. అయితే నిద్రపోకపోవడం అంటే కేవలం అలసట మాత్రమే కాదు.. అది మీ శరీరాన్ని లోపల నుండి నెమ్మదిగా కాల్చేస్తున్న ఒక నిశ్శబ్ద విషం. నిద్ర సరిగ్గా లేకపోతే ఏ వ్యాధులు వస్తాయంటే.. నేటి ఆధునిక జీవనశైలిలో పని ఒత్తిడి.. మొబైల్ వ్యసనం మన కంటి నిద్రను దూరం చేస్తున్నాయి. రాత్రి ఆలస్యంగా పడుకోవడం, ఉదయాన్నే పరుగుల మీద లేవడం చాలామందికి అలవాటుగా మారింది. అయితే ఈ అసంపూర్ణ నిద్ర మీ శరీరాన్ని లోపల నుండి ఎలా దెబ్బతీస్తుందో తెలిస్తే షాక్ అవుతారు. నిద్రలేమి కేవలం అలసట మాత్రమే కాదు, అది అనేక దీర్ఘకాలిక వ్యాధులకు ఆహ్వానం పలుకుతోంది. ప్రధానంగా ఉదయం లేవగానే తీవ్రమైన నీరసం, రోజంతా చిరాకుగా ఉండటం, దృష్టి కేంద్రీకరించలేకపోవడం, కళ్లు మంటగా అనిపించడం, తల బరువుగా ఉండటం, చిన్న చిన్న విషయాలకే కోపం రావడం, మూడ్ స్వింగ్స్ వంటి లక్షణాలు ఉంటే ఒకవేళ మీరు ఈ సమస్యలు ఎదుర్కొంటుంటే మీ శరీరానికి తగినంత నిద్ర అందడం లేదని అర్థం..గుండె జబ్బుల ముప్పు: నిద్ర లేకపోవడం వల్ల శరీరంలో రక్తపోటు పెరుగుతుంది. ఇది క్రమంగా గుండెపోటు లేదా స్ట్రోక్ వంటి తీవ్రమైన సమస్యలకు దారితీస్తుంది. రక్తంలో కొలెస్ట్రాల్ స్థాయిలు పెరగడానికి కూడా నిద్రలేమి ప్రధాన కారణం.శరీరంలో ఇన్సులిన్ పనితీరు నిద్రపై ఆధారపడి ఉంటుంది. తగినంత విశ్రాంతి లేకపోతే రక్తంలో చక్కెర స్థాయిలు అదుపు తప్పుతాయి. ఇది చివరకు డయాబెటిస్‌కు దారితీస్తుంది. మనం సరిగ్గా నిద్రపోనప్పుడు



ఆకలిని ప్రేరేపించే హార్మోన్లు యాక్టివేట్ అవుతాయి. దీనివల్ల రాత్రిపూట ఎక్కువగా తినాలనిపించడం, జీవక్రియ మందగించడం జరిగి ఊబకాయం బారిన పడతారు. నిద్ర లేకపోవడం మెదడులోని నరాల పనితీరును ప్రభావితం చేస్తుంది. ఇది తీవ్రమైన ఆందోళన, ఒత్తిడి, నిరాశ వంటి సమస్యలకు మూలకారణం అవుతుంది. శరీరం వ్యాధులతో పోరాడే సామర్థ్యాన్ని కోల్పోతుంది. దీనివల్ల తరచుగా జలుబు, దగ్గు, జ్వరం వంటి ఇన్ఫెక్షన్ల బారిన పడే ప్రమాదం ఉంది.ప్రతిరోజూ ఒకే సమయానికి పడుకోవడం, మేల్కొనడం అలవాటు చేసుకోండి.పడుకునే గంట ముందు మొబైల్, ల్యాప్‌టాప్ పక్కన పెట్టేయండి.రాత్రిపూట టీ, కాఫీ మానుకోండి. తేలికపాటి భోజనం చేయండి.పగటిపూట కనీసం 30 నిమిషాల నడక లేదా యోగా నిద్ర నాణ్యతను పెంచుతుంది.మనస్సును ప్రశాంతంగా ఉంచుకోవడానికి లోతైన శ్వాస వ్యాయామాలు చేయండి. ప్రతి మనిషికి రోజుకు కనీసం 7 నుండి 8 గంటల× నాణ్యమైన నిద్ర అవసరం. నిద్ర సమస్యలు దీర్ఘకాలం కొనసాగితే, సొంత వైద్యం కాకుండా వెంటనే నిపుణులైన వైద్యుడిని సంప్రదించడం ఉత్తమం. గుర్తుంచుకోండి, మీరు ఇచ్చే విశ్రాంతే మీ రేపటి ఆరోగ్యానికి పెట్టుబడి!

# బ్యూటీ సీక్రెట్ రివీల్ చేసిన సానియా మిర్జా

ఆమె రాకెట్ పట్టి కోర్టులోకి దిగిందంటే ప్రత్యర్థులకు వణుకు పుట్టాల్సిందే. భారత టెన్నిస్ క్వీన్‌గా అంతర్జాతీయ వేదికలపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసిన ఆ ధ్రువతార.. ఆట నుంచి విరామం తీసుకున్నా తన ఫిజిక్, గ్లామర్ విషయంలో మాత్రం ఏమాత్రం తగ్గడం లేదు. సాధారణంగా క్రీడాకారులు రిటైర్మెంట్ తర్వాత ఫిట్‌నెస్‌ను పక్కన పెడతారు. కానీ ఈ టెన్నిస్ సెన్సేషన్ మాత్రం మునుపటి కంటే ఇప్పుడు మరింత కాంతివంతంగా, అత్యంత ఆకర్షణీయంగా కనిపిస్తూ అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. ఒక బిడ్డకు తల్లిగా బాధ్యతలు నిర్వర్తిస్తూనే, తన బిజీ షెడ్యూల్‌లో ఇంత పర్ఫెక్ట్‌గా ఎలా మెయింటైన్ చేస్తోంది? తన గ్లోయింగ్ స్కిన్ వెనుక ఉన్న పది రకాల కోరియన్ పద్ధతులు ఏంటి? చర్మం, జుట్టు కోసం ఆమె ఉపయోగిస్తున్న ఆ వింత 'రెడ్ లైట్ థెరపీ' విశేషాలేంటి? టెన్నిస్ స్టార్ సానియా మిర్జా స్వయంగా వెల్లడించిన తన లేటెస్ట్ హెల్త్ అండ్ బ్యూటీ డైరీ ఇప్పుడొక సెన్సేషన్‌గా మారింది. సానియా మిర్జా తన రోజును భారీ బ్రేక్ ఫాస్ట్ తో కాకుండా ఒక 'హెల్తీ షాట్' తో ప్రారంభిస్తుంది. పసుపు, తేనె, నిమ్మరసం, అల్లం, కొన్ని నల్ల గింజలు (బ్లాక్ సీడ్స్) కలిపి తీసుకుంటుంది. "ఇది తాగడానికి అస్సలు రుచిగా ఉండదు కానీ శరీరానికి మాత్రం చాలా మేలు చేస్తుంది" అని సానియా పేర్కొంది. దీని తర్వాత నీటిలో నానబెట్టిన చియా విత్తనాలు, కాఫీ తీసుకుని జిమ్ కు వెళ్తుంది. ఉదయం పూట 3 నుంచి 4 కోడిగుడ్ల తెల్లసొన తీసుకోవడం ఆమెకు అలవాటు. టెన్నిస్ ఆడుతున్నప్పుడు తన డైట్ ఎలా ఉండేదో, ఇప్పుడు ఎలా ఉందో సానియా వివరించింది. "మునుపు ఆట కోసం నేను కార్బోహైడ్రేట్లు ఎక్కువగా తీసుకునేదాన్ని. ఇడ్లీలు, దోశలు ఇలా



ప్రతిదీ తినేదాన్ని. కానీ ఇప్పుడు నా శారీరక శ్రమ 20 శాతానికి పడిపోయింది. అందుకే ఇప్పుడు కార్బోహైడ్రేట్లు తగ్గించి ప్రోటీన్ ఫుడ్ కే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నాను" అని సానియా చెప్పింది. ఇప్పుడు న్యూట్రిషనిస్టులు లేకపోయినా, తనే స్వయంగా తన ప్రోటీన్ ఇన్ టేక్ ను పర్యవేక్షించుకుంటోంది. సానియా వర్కవుట్ లో ఇప్పుడు వెయిట్ ట్రైనింగ్ తో పాటు అవుట్‌డోర్ రన్నింగ్ కు ప్రాధాన్యత ఇస్తోంది. సమయం తక్కువగా ఉండటం వల్ల పైలేట్స్ వంటి పద్ధతులను పక్కన పెట్టింది. వాతావరణం బాగున్నప్పుడు రోజుకు 5 నుంచి 7 కిలోమీటర్ల వరకు రన్నింగ్ చేయడం ఆమెకు ఇష్టం. ఈ జిమ్ ట్రైనింగ్, అవుట్‌డోర్ కార్డియో కలయిక వల్ల తన శరీరం దృఢంగా ఉండటమే కాకుండా ఎంతో ఉత్సాహంగా ఉంటుందని ఆమె నమ్ముతోంది. సానియా మిర్జా తన అందం కోసం ఎంతో శ్రద్ధ తీసుకుంటోంది. "నేను ఉదయం 10 రకాలు, రాత్రి 10 రకాల కోరియన్ స్కిన్ కేర్ పద్ధతులను పాటిస్తాను. ఇది కొంచెం వింతగా అనిపించినా నా స్కిన్ కి మాత్రం అద్భుతంగా పనిచేస్తోంది" అని ఆమె నవ్వుతూ చెప్పింది. అయితే ఇందులో మాయిశ్చరైజర్, సన్‌స్క్రీన్ అనేవి తన ఫేవరెట్ అని, ఇవి గేమ్ చేంజర్స్ అని సానియా అభిప్రాయపడింది. గడిచిన ఏడాది కాలంగా సానియా 'రెడ్ లైట్ థెరపీ'ని తన దినచర్యలో చేర్చుకుంది. ఇది కేవలం చర్మం కోసమే కాకుండా జుట్టు పెరుగుదలకు కూడా ఎంతో సహాయపడుతుందని ఆమె వెల్లడించింది. రోజు మార్చి రోజు అరగంట పాటు ఈ థెరపీ కింద కూర్చోవడం వల్ల చర్మం రీజువినేట్ అవుతుందని, ఎంతో కాంతివంతంగా మారుతుందని సానియా తన అనుభవాన్ని పంచుకుంది. సానియా మిర్జా ప్రయాణం చూస్తుంటే.. క్రమశిక్షణ అనేది కేవలం ఆటలోనే కాదు, జీవితంలోనూ ముఖ్యమని అర్థమవుతుంది. మారుతున్న కాలానికి అనుగుణంగా తన ఆహారపు అలవాట్లను, వ్యాయామ పద్ధతులను మార్చుకుంటూ ఆమె అందరినీ ఇన్‌స్పైర్ చేస్తోంది.

# జింబాబ్వేతో మ్యాచ్‌కి టీమిండియాలో 3 మార్పులు పక్కా!




జింబాబ్వేతో జరిగే కీలక మ్యాచ్‌లో భారత్ తప్పక గెలవాల్సిన పరిస్థితిలో ఉంది. ఈ మ్యాచ్ ఫిబ్రవరి 26వ తేదీన చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియంలో జరగనుంది. అయితే ఇప్పటి వరకు అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్ ఓపెనింగ్ జోడీ ఆశించిన స్థాయిలో రాణించకపోవడంతో.. టీమ్ మేనేజ్‌మెంట్ టాప్ ఆర్డర్‌లో భారీ మార్పులు చేసేందుకు సన్నాహాలు చేస్తుంది. అంతేకాదు, ప్లేయింగ్ ఎలెవెన్‌లో సుమారు మూడు మార్పులు చేసే అవకాశం ఉంది.

**రింకూ సింగ్ ఔట్ – సంజూ శాంసన్ ఇన్**

రింకూ సింగ్ తన తండ్రి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో జట్టును విడిచి పెట్టి గ్రేటర్ నోయిడాలోని ఆసుపత్రికి వెళ్లాడు. దీంతో అతడు జింబాబ్వేతో మ్యాచ్‌కు అందుబాటులో ఉండే అవకాశాలు దాదాపుగా లేనట్లే.. అంతేకాదు, దక్షిణాఫ్రికాతో మ్యాచ్ తర్వాత కూడా రింకు స్థానం చర్చనీయాంశంగా మారింది. ఈ పరిస్థితిలో సంజూను జట్టులోకి తీసుకోవడంతో టాప్ ఆర్డర్ బ్యాటింగ్ మరింత బలపడుతుంది. నమీబియాతో మ్యాచ్‌లో సంజూ కేవలం 8 బంతుల్లోనే 22 పరుగులు చేసి తన దూకుడు ప్రదర్శించాడు.

**వాషింగ్టన్ సుందర్ అవుట్- అక్షర్ పటేల్ ఇన్**

దక్షిణాఫ్రికాతో మ్యాచ్‌లో అక్షర్ పటేల్‌ను పక్కన పెట్టడం పెద్ద చర్చకు దారి తీసింది. వ్యూహాత్మకంగా వాషింగ్టన్ సుందర్‌కు అవకాశం ఇచ్చినా అది భారత్‌కు పెద్దగా కలిసిరాలేదు. సుందర్ వికెట్లు తీయకపోగా, బ్యాటింగ్‌లో కూడా విఫలమయ్యాడు. దీంతో వైస్ కెప్టెన్ అక్షర్ పటేల్ తిరిగి జట్టులోకి రావాల్సిన అవసరం ఏర్పడింది. చెన్నై పిచ్ స్పిన్‌కు అనుకూలంగా ఉండే అవకాశం ఉండటంతో అతడు నాలుగు ఓవర్లు ఖచ్చితంగా వేసే అవకాశం ఉంది. అంతేకాదు, బ్యాటింగ్ చేసే సామర్థ్యం అక్షర్ కి ఉంది.

**ఓపెనర్ గా సంజూ- 3వ స్థానంలో ఇషాన్**

భారత్ పవర్‌ప్లేలో రాణించేలా టీం మేనేజ్మెంట్ వ్యూహాత్మక మార్పులు చేస్తుంది. సంజూ శాంసన్ రైట్‌హ్యాండ్ బ్యాటర్ కావడంతో ప్రత్యర్థి కెప్టెన్ ఆఫ్ స్పిన్నర్‌తో బౌలింగ్ ప్రారంభించకుండా అడ్డుకోగలడు.. అలాగే స్పిన్నర్లపై భారీ షాట్లు ఆడటంలో అతడు దిట్టా. ఈ మార్పుతో ఇషాన్ కిషన్ నంబర్-3లో బ్యాటింగ్ చేసే అవకాశం కనిపిస్తుంది. అలా చేస్తే మిగతా బ్యాటింగ్ లైనప్ పూర్తిగా మారిపోతుంది. జింబాబ్వేతో మ్యాచ్‌లో భారత్ గెలవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అందుకోసం టాప్ ఆర్డర్ కాంబినేషన్, ఆల్‌రౌండర్ల ఎంపికలో ఈ మార్పులు భారత్‌కు కీలకంగా మారే అవకాశం ఉంది.

# ఇంగ్లాండ్ ఘన విజయం.. సెమీస్ రేస్ పాకిస్తాన్‌కి కష్టమే?




టీ20 వరల్డ్ కప్ సూపర్--8లో భాగంగా పల్లెకెలే అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరిగిన ఉత్కంఠభరితమైన మ్యాచ్‌లో ఇంగ్లాండ్ రెండు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్ ఓటమితో పాకిస్తాన్ సెమీ ఫైనల్ కి చేరుకునే అవకాశాలు దాదాపుగా గల్లంతయ్యాయి. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ తీసుకున్న పాకిస్తాన్ కి ఆరంభంలోనే బిగ్ షాక్ తగిలింది. పాక్ బ్యాటర్లలో సైమ్ ఆయూబ్ (7), ఉస్మాన్ ఖాన్ (9), సల్మాన్ అఘా (5), మొహమ్మద్ నవాజ్ (0), షాహీన్ అఫ్రిది (2)లు దారుణంగా విఫలమయ్యారు.

మరోవైపు, పాక్ బ్యాటర్లలో సాహిబ్జాదా ఫర్హాన్ (63) అర్ధ శతకంలో జట్టు స్కోర్ 164 చేయడంలో కీలక పాత్ర పోషించాడు. బాబర్ ఆజామ్ (25), ఫఖార్ జమాన్ (25), షాదాబ్ ఖాన్ (22) ఫర్వాలేదనిపించారు. ఇక 165 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లాండ్ జట్టుకు మొదట్లో కాస్త తడబడింది. ఇంగ్లాండ్ బ్యాటర్లు ఫిలిప్ సాల్ట్ (0), జోస్ బట్లర్ (2), జేకబ్ బెథెల్ (8), టామ్ బాంటన్ (2), జేమీ ఓవర్టిన్ (0) ఐదుగురు కేవలం సింగిల్ డిజిట్ పరుగులకే ఔట్ కాగా, సామ్ కరన్ (16) మరోసారి విఫలం అయ్యారు. కాగా చివర్లో

ఇంగ్లాండ్ బ్యాటర్ విల్ జాక్స్ ( 28) చెలరేగడంతో మరో రెండు వికెట్లు ఉండగానే ఘన విజయం సాధించింది. అయితే పాకిస్తాన్ బౌలర్లు చివరి వరకు విజయం కోసం తెగ ప్రయత్నం చేసినప్పటికీ గెలుపు ఇంగ్లీష్ జట్టునే వరించింది. పాక్ బౌలర్లలో షాహీన్ అఫ్రిది చెలరేగి కీలకమైన నాలుగు వికెట్లను తీసుకోగా, ఉస్మాన్ తారిక్, షాదాబ్ ఖాన్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు.

ట్రిప్తి డిమ్రీ యొక్క టైమ్‌లెస్ వైట్ మ్యాజిక్





# మహేష్ నెక్స్ట్ ఏంటి? ఆ కాంబో డౌటేనా?

టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు.. ఇప్పుడు వారణాసి మూవీతో ఫుల్ బిజీగా ఉన్న విషయం తెలిసిందే. పాన్ వరల్డ్ ప్రాజెక్ట్ గా దర్శక ధీరుడు రాజమౌళి తెరకెక్కిస్తున్న ఆ సినిమా షూటింగ్ ఇప్పుడు శరవేగంగా జరుగుతోంది. రామోజీ ఫిల్మ్ సిటీలో వేసిన ప్రత్యేక సెట్ లో జరుగుతున్న షెడ్యూల్ లో మహేష్ బాబు పాల్గొంటున్నారు. కీలక సన్నివేశాలు ఆయన ఇప్పుడు కంప్లీట్ చేస్తున్నట్లు సమాచారం.

వచ్చే ఏడాది వేసవి కానుకగా వారణాసి మూవీ రిలీజ్ కానుండగా.. ఆ తర్వాత మహేష్ బాబు ఏ సినిమా చేయనున్నారనేది ఇప్పుడు పెద్ద క్వశ్చన్ మార్క్ గా మారింది. ఎందుకంటే ఇప్పటి వరకు ఎలాంటి అనౌన్స్మెంట్ రాలేదు. సాధారణంగా చాలా మంది స్టార్ హీరోలు ఓ సినిమా చేస్తూనే.. మరో మూవీని కన్ఫర్మ్ చేస్తుంటారు. కానీ మహేష్ బాబు లైనప్ విషయంలో ఎలాంటి ప్రకటన రాకపోవడం గమనార్హం.అయితే వారణాసి తర్వాత మహేష్ బాబు.. టాలెంటెడ్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో సినిమా చేయనున్నట్లు కొన్ని రోజులుగా ప్రచారం జరుగుతోంది. ఎక్కడా ఎలాంటి లీక్ గానీ.. ప్రకటన గానీ రాకపోయినప్పటికీ వార్తలు మాత్రం వైరల్ అవుతున్నాయి. వారణాసి తర్వాత మహేష్, స్పిరిట్ తర్వాత సందీప్.. ఇద్దరూ కలిసి భారీ ప్రాజెక్ట్ కోసం చేతులు కలపనున్నారని అంతా అనుకున్నారు.కానీ అది జరిగేలా కనిపించడం లేదు. ఒక వేళ ఫ్యూచర్ లో మహేష్- సందీప్ కాంబినేషన్ లో మూవీ వచ్చే ఛాన్స్ ఉన్నా.. వారణాసి, స్పిరిట్ తర్వాత వారి కలయికలో సినిమా రూపొందే అవకాశాలు చాలా తక్కువగానే ఉన్నాయని చెప్పాలి. ఎందుకంటే ఇప్పటి వరకు చూసుకుంటే వారణాసి తర్వాత మహేష్ బాబు ఫ్రీగానే ఉంటారు. కానీ సందీప్ మాత్రం బిజీగా ఉండనున్నట్లు రీసెంట్ గా క్లారిటీ వచ్చింది!బాలీవుడ్ స్టార్ హీరో రణబీర్ కపూర్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. సందీప్ వంగా తదుపరి సినిమా యానిమల్ పార్క్ అని తెలిపారు. అంతే కాదు.. ఆ మూవీ షూటింగ్ 2027లో ప్రారంభం అవుతుందని చెప్పారు. దీంతో స్పిరిట్ కంప్లీట్ అయ్యాక.. యానిమల్ పార్క్ పై సందీప్ ఫోకస్ పెట్టనున్నట్లు అర్థమైంది. అందుకే మహేష్ బాబు.. నెక్స్ట్ మూవీ సందీప్ తో ఉండదని తెలుస్తోంది.

మరి సందీప్ కాకుంటే.. మహేష్ బాబు ఎవరితో వర్క్ చేయనున్నారనేది ఇంకా ఎలాంటి క్లారిటీ లేదు. సోషల్ మీడియాలో దానిపై ఎలాంటి ఊహాగానాలు చక్కర్లు కొట్టడం లేదు.

కాబట్టి మహేష్ బాబుతో వర్క్ చేసే ఛాన్స్ అందుకునే డైరెక్టర్ ఎవరనేది తెలియాల్సి ఉంది. అయితే వారణాసి రావడానికి ఇంకా ఏడాది సమయం ఉంది. కాబట్టి ఇంతలో మహేష్ నెక్స్ట్ మూవీపై ఏమైనా అప్డేట్ వస్తుందేమో వేచి చూడాలి.

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com